RNI : APTEL/25/A0108

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

మహి న్యూస్

ఆంధ్రప్రదేశ్‌లో వెలువడుతున్న మహి న్యూస్ తెలుగు దినపత్రికకు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ, మండలాల విలేకరులు కావలెను. తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలను రాయగలిగి ఉన్న వారికి, వార్తలను టైపు చేయగలిగి ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

-: సంప్రదించండి :-

9059585898

ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 02 సంచిక : 13, ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 8, వెల రూ. 5, /- గురువారం - 16 - ఏప్రిల్ - 2026

published From : YSR Kadapa. circulated by Kurnool I Anantapuram I Chitoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad and Telangana

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి...

### 12 మంది పరిస్థితి విషమం



- సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి

## సీఎం చదివిన బడిలో క్రీడా వికాస కేంద్రం

- చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు స్పోర్ట్స్ సెంటర్ ను ప్రారంభించిన మంత్రి లోకేశ్



- చంద్రగిరిలో క్రీడా సంబరం
- రూ.3.17 కోట్లతో క్రీడా కేంద్రం
- మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం

## అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయం



బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉధృతం: వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన

పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా



## అధికారంలోకి రాగానే

### మత్స్యకారుల హక్కులు కాపాడతాం

- దేవుడు అన్నీ చూస్తున్నాడు.. మత్స్యకారుల హక్కుల్ని చంద్రబాబు తాత కూడా తీసుకోలేరు: జగన్
- కళ్లు మూసి తెరిచేలోగా మళ్లీ మన ప్రభుత్వమన్న జగన్
- కూటమి పాలనలో మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని విమర్శ
- జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ

అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోందని,

# కుంభమేళా తరహాలో
# గోదావరి పుష్కరాలు

## 10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా

- ★ పవన్ కీలక ఆదేశాలు
- ★ 2027లో వచ్చే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం
- ★ ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్న మంత్రి దుర్గేశ్



అమరావతి: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించినట్లు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, మిగతా.. 2లో



## పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

- ★ ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ★ జూన్ చివరి నాటికి వెలిగొండ మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- ★ నేరడి బ్యారేజ్, చింతలపూడి కెనాల్‌కు త్వరలో టెండర్లు

అమరావతి: రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న మిగతా.. 2లో



## మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతిస్తాం

- అదే జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారు: బీజేపీకి కేటీఆర్ హెచ్చరిక
- డీలిమిటేషన్ బిల్లు పేరుతో దక్షిణాదికి అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక
- బీజేపీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శ

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. మిగతా.. 2లో

## మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

- నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు
- సిఎం రేవంత్ తీరుపై బిజెపి మండిపాటు
- అనుమానాలతో గందరగోళం సృష్టించవద్దు



హైదరాబాద్: మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై సిఎం రేవంత్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ రెంటినీ కలపడాన్ని కుట్ర కోణంగా అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానికి లేఖ రాశారు. అయితే రేవంత్ అభిప్రాయాలను బిజెపి నేతలు తోసిపుచ్చారు. పార్లమెంట్ అత్యున్నత వేదిక అని, అక్కడే జరగబోతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్‌కు అవగాహన లేదని బండి సంజయ్ కూడా వ్యాఖ్యానించారు. ప్రధాని నరేంద్ర మోదీకి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి రాసిన లేఖపై భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కూడా స్పందించారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. మిగతా.. 2లో

## భగ్గుమన్న సూరీడు..

- పలు జిల్లాల్లో 43 డిగ్రీలు దాటిన ఎండలు
- తెలంగాణలో ఉగ్రరూపం దాల్చిన ఎండలు.. రానున్న 5 రోజులు కీలకం
- నల్గొండ జిల్లాలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పలు జిల్లాల్లో 42 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- రానున్న ఐదు రోజుల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం
- వాతావరణ శాఖ నుంచి ప్రజలకు హెచ్చరిక



హైదరాబాద్: తెలంగాణలో భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మధ్యలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో మిగతా.. 2లో



## బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. సామ్రాట్ చౌదరితో పాటు జేడీయూ సీనియర్ నేతలు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. మిగతా.. 2లో




## తెలంగాణ నుంచి 9 మంది మహిళా ఎంపీలు

### మహిళలకు తొమ్మిది ఇవ్వాల్సిందే..

### కొత్తగా 9 లేదా 10 లోక్‌సభ స్థానాలు!?

2011 లెక్కల ప్రకారం పాత ఉమ్మడి జిల్లాల జనాభా

| జిల్లా | జనాభా | పురుషులు | మహిళలు |
|---|---|---|---|
| రంగారెడ్డి | 52,96,741 | 27,01,008 | 25,95,733 |
| మహబూబ్‌నగర్ | 40,53,028 | 20,50,386 | 20,02,642 |
| హైదరాబాద్ | 39,43,323 | 20,18,575 | 19,24,748 |
| కరీంనగర్ | 37,76,269 | 18,80,800 | 18,95,469 |
| వరంగల్ | 35,12,576 | 17,59,281 | 17,53,295 |
| నల్గొండ | 34,88,809 | 17,59,772 | 17,29,037 |
| మెదక్ | 30,33,288 | 15,23,030 | 15,10,258 |
| ఖమ్మం | 27,97,370 | 13,90,988 | 14,06,382 |
| నిజామాబాద్ | 25,51,335 | 12,50,641 | 13,00,694 |
| ఆదిలాబాద్ | 19,80,980 | 9,85,303 | 9,95,677 |

### ఇందులో గ్రేటర్ చుట్టుపక్కలే 3 లేదా 4

హైదరాబాద్: పునర్విభజన బిల్లుతో రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాల రాజకీయ ముఖచిత్రం పూర్తిగా



## కమిటీలలో సామాన్యులకు పెద్దపీట

- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్..
- టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ నియామకం
- పొలిట్‌బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించిన టీడీపీ
- కమిటీల కూర్పులో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట
- పొలిట్‌బ్యూరోలో సామాన్య కార్యకర్తలకు చోటు కల్పించిన అధిష్ఠానం

# దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోం

## పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదు

- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కేసీఆర్ నిర్ణయం ఇదీ
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ సంపూర్ణ మద్దతు
- డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి



హైదరాబాద్: భారత ప్రభుత్వం రేపు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ మిగతా.. 2లో

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
మహి న్యూస్
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com



## భారత్‌లోకి 800 మంది ఉగ్రవాదులను
# పంపేందుకు పాక్ భారీ కుట్ర

ఢిల్లీ: జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టించేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపింది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచిస్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం నియంత్రణ రేఖ (ఎల్ఓసీ), అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లను పునరుద్ధరించినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదునుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం. ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దీంతో పాక్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున ఉగ్రవాదుల బృందాలను పంపి, భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని చూస్తోంది. ఈ పద్ధతిలో కనీసం కొందరైనా లోపలికి ప్రవేశించగలరని వారు భావిస్తున్నారు. గతేడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోవడంపై లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

## ఏఐతో చర్మ క్యాన్సర్ స్క్రీనింగ్..
# మరింత కచ్చితంగా, సమర్థంగా!

ఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహాయంతో ప్రాణాంతక చర్మ క్యాన్సర్లలో ఒకటైన మెలనోమా ముప్పును ముందుగానే గుర్తించవచ్చని స్వీడన్‌లో జరిగిన ఒక కొత్త అధ్యయనం తేల్చింది. ఆరోగ్య వ్యవస్థల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్న డేటాను విశ్లేషించడం ద్వారా ఈ ఘనత సాధించవచ్చని పరిశోధకులు బుధవారం వెల్లడించారు. ఈ అధ్యయనం కోసం స్వీడన్‌లోని దాదాపు 60 లక్షల మంది వయోజన జనాభాకు సంబంధించిన ఆరోగ్య రికార్డులను పరిశీలించారు. వారి వయసు, లింగం, గత ఆరోగ్య సమస్యలు, వాడుతున్న మందులు, సామాజిక, ఆర్థిక స్థితి వంటి వివరాలను ఏఐ ద్వారా విశ్లేషించారు. ఐదేళ్ల అధ్యయన కాలంలో వీరిలో 38,582 మంది (0.64 శాతం) మెలనోమా బారిన పడినట్టు గుర్తించారు. కేవలం వయసు, లింగం ఆధారంగా మెలనోమాను అంచనా వేసే పద్ధతితో పోలిస్తే, ఏఐ మోడల్ మెరుగైన ఫలితాలను ఇచ్చింది. సాధారణ పద్ధతిలో 64 శాతం కచ్చితత్వం ఉండగా, అధునాతన ఏఐ మోడల్ సుమారు 73 శాతం కేసుల్లో మెలనోమా వచ్చే వారిని, రాని వారిని వేరు చేయగలిగింది. అంతేకాకుండా, ఐదేళ్లలో మెలనోమా వచ్చే ప్రమాదం 33 శాతం వరకు ఉన్న హై-రిస్క్ గ్రూపులను కూడా ఈ ఏఐ మోడల్ గుర్తించడం విశేషం. గోథెన్‌బర్గ్ యూనివర్సిటీ పరిశోధకుడు మార్టిన్ గిల్‌స్టెడ్ మాట్లాడుతూ, "ఆరోగ్య వ్యవస్థల్లో ఉన్న డేటాతోనే మెలనోమా ముప్పు ఉన్నవారిని గుర్తించవచ్చని మా అధ్యయనం నిరూపించింది" అని తెలిపారు. దీనివల్ల హై-రిస్క్ గ్రూపులకు మాత్రమే సెలెక్టివ్ స్క్రీనింగ్ నిర్వహించి, వైద్య వనరులను మరింత సమర్థంగా వాడుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయితే, ఈ విధానాన్ని వైద్య రంగంలో ప్రవేశపెట్టే ముందు మరిన్ని పరిశోధనలు, విధానపరమైన నిర్ణయాలు అవసరమని వారు స్పష్టం చేశారు.

## కాల్పుల విరమణ పొడిగింపుపై
# డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు

అమెరికా: కాల్పుల విరమణ పొడిగింపుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌తో కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన లేదని స్పష్టం చేశారు. ఇరాన్‌తో కొనసాగుతున్న కాల్పుల విరమణను పొడిగించే ఆలోచన తనకు లేదని అన్నారు. శాశ్వతమైన ఒప్పందం వైపు తాము మొగ్గు చూపుతున్నామని అన్నారు. టెహ్రాన్‌తో చర్చలు కొనసాగుతున్నప్పటికీ కాల్పుల విరమణను పునరుద్ధరించకుండానే అవి ముగిసే అవకాశముందని అన్నారు. చర్చల ఫలితం ఎలా ఉంటుందనే విషయాన్ని పక్కన పెడితే, ఇరాన్‌తో ఒప్పందం కుదిరితేనే అందరికీ మంచిదని అభిప్రాయపడ్డారు. ఒప్పందం కుదిరితే ఇరాన్ కూడా తమ దేశాన్ని పునర్నిర్మించుకోవచ్చని అన్నారు. అమెరికా-ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ అంగీకారం గడువు ఈ నెల 21తో ముగియనుంది. ఈ నేపథ్యంలో చర్చల ద్వారా శాశ్వత శాంతి ఒప్పందం కుదుర్చుకోవాలని అమెరికా ఎదురు చూస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. ఇస్లామాబాద్ వేదికగా ఇరాన్ అధికారులతో అమెరికా ప్రతినిధులు మరోసారి సమావేశం కానున్నారని ట్రంప్ వెల్లడించారు. రెండో విడత చర్చలపై ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# సీఎం చదివిన బడిలో క్రీడా వికాస కేంద్రం

తిరుపతి: తిరుపతి జిల్లా చంద్రగిరిలో క్రీడా సంబరం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, దివంగత నారా రామ్మూర్తినాయుడు స్మారకార్థం నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించిన లోకేశ్... ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి కాసేపు బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు హాకీ క్రీడాకారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన నారా రామ్మూర్తినాయుడు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణంలోని క్రీడా సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో టేబుల్ టెన్నిస్, హాకీ ఆడుతూ వారిలో ఉత్సాహం నింపారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. సీఎం చంద్రబాబు విద్యాభ్యాసం చేసిన చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో రూ.3.17 కోట్ల వ్యయంతో ఈ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దారు. 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ కేంద్రాన్ని మంజూరు చేయగా, గత ప్రభుత్వ హయాంలో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తాజాగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, స్క్వాష్, చెస్, స్విమ్మింగ్, యోగా, జిమ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. అలాగే అవుట్‌డోర్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు ప్రత్యేక హాకీ మైదానాన్ని కూడా సిద్ధం చేశారు. చంద్రగిరి, పరిసర ప్రాంతాల యువ క్రీడాకారుల శిక్షణ, అభివృద్ధికి ఈ కేంద్రం ఒక వేదికగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ శ్రీపతి బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, దండు పూజ, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

# సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు..
# ఐదుగురి మృతి...
# 12 మంది పరిస్థితి విషమం

శ్రీ సత్యసాయి జిల్లా: శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది. వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కాలి ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# మహిళా రిజర్వేషన్
# బిల్లుకు మద్దతిస్తాం

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన బిల్లులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే కేసీఆర్ ముందుండి ఉద్యమాన్ని నడిపిస్తారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. డీలిమిటేషన్ బిల్లు పేరుతో మనకు అన్యాయం జరిగితే కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమం మొదలవుతుందని హెచ్చరించారు. పార్లమెంటులో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాల వాటా 24 శాతంగా ఉందని, డీలిమిటేషన్ తర్వాత ఇది అలాగే ఉండాలని అన్నారు. బీజేపీ పార్టీ తెలంగాణకు ఎప్పుడూ మంచి చేయదని విమర్శించారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు సీట్లను 50 శాతం పెంచుతామని కిషన్ రెడ్డి చెబుతున్నారని, కానీ డీలిమిటేషన్ బిల్లులో ఆ అంశమే లేదని అన్నారు. కిషన్ రెడ్డి చెప్పిన ప్రకారం అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి, 17 లోక్ సభ స్థానాలు 26 పెరుగుతాయని చెప్పారని తెలిపారు. కానీ బిల్లులో ఆ పెరుగుదల లేదని అన్నారు. బీజేపీ ఎప్పుడూ తెలంగాణకు మిత్రుడు కాదని విమర్శించారు. 2014 ఏపీ పునర్విభజన బిల్లులోనే సీట్ల పెంపు హామీ ఉందని గుర్తు చేశారు. కానీ ఇప్పటి వరకు ఆ హామీని నెరవేర్చలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ అనుకూలమేనని, కానీ డీలిమిటేషన్ బిల్లులో మాత్రం తెలంగాణకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

# పోలవరం ప్రాజెక్టును
# పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి

మొదటి పేజి తరువాయి

రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ.5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించారు. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అధికారంలోకి రాగానే
# మత్స్యకారుల హక్కులు కాపాడతాం

మొదటి పేజి తరువాయి

దేవుడు అన్నీ చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ.26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తి చేశామని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. 2024 మార్చి 12న తాము జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని, కానీ నేటికీ దానిని మత్స్యకారులకు ఎందుకు అప్పగించలేదని కూటమి ప్రభుత్వాన్ని జగన్ ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా, వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. మార్చి 12న నారా లోకేశ్ జువ్వలదిన్నెను సందర్శించగా, 16న ఇక్కడ సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని జగన్ ఆరోపించారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ దొంగతనం చేశారని, అందుకే ఒక్కరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బోట్లు ఎత్తుకెళ్లేవారికి ముఖ్యమంత్రి కొడుకు ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. మూడేళ్లు కళ్లు మూసి తెరిచేలోగా గడిచిపోతాయని, ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని జగన్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు అని, వాటిని చంద్రబాబు తాత కూడా వారి నుంచి తీసుకోలేరని జగన్ స్పష్టం చేశారు.

# అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయం

హైదరాబాద్: పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# కమిటీలలో సామాన్యులకు పెద్దపీట

అమరావతి: తెలుగుదేశం పార్టీలో నూతన నాయకత్వానికి, కొత్త సమీకరణాలకు అధిష్ఠానం శ్రీకారం చుట్టింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా పొలిట్ బ్యూరో, జాతీయ, రాష్ట్ర కమిటీలను ప్రకటించింది. ఈ పునర్వ్యవస్థీకరణలో అత్యంత ముఖ్యమైన నిర్ణయంగా, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను నియమించారు. ఈ మేరకు టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీనియర్ల అనుభవానికి, యువత ఉత్సాహానికి సమ ప్రాధాన్యం ఇస్తూ, సామాజిక కోణంలో కమిటీలను కూర్పు చేసినట్లు ఆయన తెలిపారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబు నాయుడు అన్ని సమీకరణాలను బేరీజు వేసుకుని ఈ కసరత్తు చేశారని పల్లా పేర్కొన్నారు. 29 మందితో పొలిట్‌బ్యూరో, 31 మందితో జాతీయ కమిటీ, 185 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. పార్టీకి విధేయులుగా ఉంటూ, కష్టపడి పనిచేసిన వారికి ఈ నియామకాల్లో పెద్దపీట వేశామని స్పష్టం చేశారు. గతానికి భిన్నంగా, క్షేత్రస్థాయి కార్యకర్తలకు సైతం అత్యున్నత పదవులు కట్టబెడుతూ చంద్రబాబు సంచలన నిర్ణయం తీసుకున్నారని అన్నారు. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, మంగళగిరి క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్‌కు నేరుగా పొలిట్‌బ్యూరోలో స్థానం కల్పించడమే ఇందుకు నిదర్శనమని వివరించారు. ఈ కమిటీల కూర్పులో సామాజిక న్యాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. 185 మంది సభ్యులున్న రాష్ట్ర కమిటీలో 122 మంది బడుగు, బలహీన వర్గాల వారేనని పల్లా తెలిపారు. ఇందులో బీసీలకు 77 (40%), ఎస్సీలకు 25 (25%), ఎస్టీలకు 7 (3.8%), మైనార్టీలకు 13 (7%) చొప్పున స్థానాలు కల్పించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు పెద్దపీట వేశారు. రాష్ట్ర కమిటీలో 50 మంది మహిళలకు అవకాశం ఇవ్వగా... పొలిట్‌బ్యూరో, జాతీయ కమిటీల్లోనూ వారికి సముచిత స్థానం కల్పించారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని, నియోజకవర్గాల పునర్విభజన, 33 శాతం మహిళా రిజర్వేషన్లు వంటి భవిష్యత్ పరిణామాలను అంచనా వేస్తూ ఈ కమిటీలను రూపొందించారని పల్లా శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ నియామకాల ద్వారా నామినేటెడ్ పదవులు ఆశించి భంగపడిన వారికి న్యాయం చేశామని, పార్టీ బలోపేతానికి ఈ మార్పులు దోహదపడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బీహార్ నూతన ముఖ్యమంత్రిగా
# సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం

మొదటి పేజి తరువాయి

మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దీంతో రాష్ట్రంలో బీజేపీ ప్రత్యక్ష నాయకత్వానికి మార్గం సుగమమైంది. ప్రమాణ స్వీకారానికి ముందు సామ్రాట్ చౌదరి రాజ్‌వంశీ నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తలపాగా శపథం నెరవేర్చుకున్న సామ్రాట్

1990లో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన సామ్రాట్ చౌదరి, 1999లోనే రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 నుంచి బీజేపీలో కీలక నేతగా ఎదుగుతూ వచ్చారు. నితీశ్ కుమార్ బీజేపీతో తెగదెంపులు చేసుకుని మహాఘటబంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న సామ్రాట్ చౌదరి ఒక శపథం చేశారు. నితీశ్‌ను సీఎం పదవి నుంచి దించేంత వరకు తన తలపాగా (మురైఠా) తీయనని ప్రతిజ్ఞ చేశారు. ఈ పంతం ఆయన రాజకీయ జీవితంలో ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇప్పుడు సీఎంగా బాధ్యతలు చేపట్టి తన శపథాన్ని నెరవేర్చుకున్నారు.

అనుభవజ్ఞులైన డిప్యూటీ సీఎంలు

నూతన ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఇద్దరూ నితీశ్ కుమార్‌కు అత్యంత నమ్మకస్తులు, పరిపాలనలో అనుభవజ్ఞులు. విజయ్ కుమార్ చౌదరి గతంలో పలు కీలక శాఖలు నిర్వహించారు. ఇక, 79 ఏళ్ల విజేంద్ర ప్రసాద్ యాదవ్‌ను 'కోసీ ప్రాంత రాజకీయ చాణక్యుడు'గా పిలుస్తారు. 1990 నుంచి వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్న ఆయన, ముఖ్యంగా విద్యుత్ రంగంలో చేసిన అభివృద్ధితో ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. సామ్రాట్ చౌదరి నాయకత్వంలో ఈ అనుభవజ్ఞులైన నేతలతో కూడిన కొత్త ప్రభుత్వం, రాష్ట్ర అభివృద్ధిని కొనసాగిస్తూ ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేరుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# మహిళా రిజర్వేషన్లతో
# డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

మొదటి పేజి తరువాయి

ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ చేశారు. భయాన్ని వ్యాప్తి చేయడం ఆపండి. రాజ్యాంగం లోని ఆర్టికల్ 81ను చదవండి. డీలిమిటేషన్ కేవలం జనాభాపైనే ఆధారపడదు. అవసరమైన ఇతర అంశాలను కూడా డీలిమిటేషన్ కమిషన్ పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. సీట్ల పెంపు కోసం ఏ ఫార్ములాను అనుసరించాలనే నిర్ణయాన్ని ఆ కమిషన్‌కే వదిలారు. అయినా ఎలాంటి కారణం లేకుండా మీరు రాజకీయాలు చేస్తున్నారు.. షేమ్ అని రామచందర్‌రావు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లతో డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దని రేవంత్ అన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల పెంపుపై అఖిలపక్ష భేటీ నిర్వహించాలని కోరారు. కీలక నిర్ణయాల్లో రాష్ట్రాలు, రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకోవాలి. డీలిమిటేషన్‌పై అన్ని రాష్ట్రాలు, రాజకీయపార్టీల ఏకాభిప్రాయం సాధించాలి. నియోజకవర్గాల పెంపులో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేయొద్దు. జాతీయస్థాయిలో విస్తృత అభిప్రాయ సేకరణ తర్వాతే డీలిమిటేషన్ చేయాలని రేవంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రామచందర్‌రావు స్పందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇలాంటి అనుమానాలతు, వ్యాఖ్యలతో ఉత్తరాది, దక్షిణాది మధ్య విభేదాలు సృష్టించవద్దని కిషన్ రెడ్డి అన్నారు.

## దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల
# విషయంలో రాజీపడబోం

మొదటి పేజి తరువాయి

దేశ, రాష్ట్ర రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

# తెలంగాణ నుంచి 9 మంది మహిళా ఎంపీలు

హైదరాబాద్: పునర్విభజన బిల్లుతో రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాల రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతమున్న వాటిని విభజించి కొత్తగా మరో 9 లేదా 10 లోక్‌సభ స్థానాలు ఏర్పాటు చేస్తారని అంచనా. దీంతో తెలంగాణ లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్య 17 నుంచి 26 లేదా 27కు పెరగనుంది. అదనంగా వచ్చే వాటిలో గ్రేటర్ హైదరాబాద్ చుట్టుపక్కలే 3 లేదా 4 ఏర్పడనుండగా.. లోక్‌సభ ఎన్నికల్లో నగరమే కీలకం కానుంది. పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. అప్పటికి రాష్ట్రంలో పది జిల్లాలున్నాయి. వీటిలో అత్యధికంగా రంగారెడ్డి ఉమ్మడి జిల్లా 52,96,741 జనాభాతో రాష్ట్రంలో మొదటిస్థానంలో, దేశంలో 17వ ర్యాంకులో ఉంది. ఈ జిల్లా ప్రస్తుతం చేవెళ్ల, మల్కాజిగిరి, సికింద్రాబాద్, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉంది. వీటి పరిధులన్నీ మారిపోయి కొత్త లోక్‌సభ నియోజకవర్గాలు రానున్నాయి. ఏ ప్రాంతం దేని పరిధిలోకి వస్తుందనేది పునర్విభజన తరవాతే తేలనుంది.

ప్రస్తుతమున్న మల్కాజిగిరి, సికింద్రాబాద్, హైదరాబాద్, భువనగిరి నియోజకవర్గాల పరిధిలో జనాభా అధికంగా ఉండటంతో వీటిని విభజించి కొత్తగా 3 లేదా 4 ఏర్పాటుచేసే అవకాశాలున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం.. 2024 ఎన్నికల సమయంలో 37.79 లక్షల మంది ఓటర్లతో దేశంలోనే అగ్రస్థానంలో ఉండటం గమనార్హం. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలు వేరుపడి కొత్తగా మరో రెండు స్థానాలు రానున్నాయి. ఉమ్మడి మెదక్‌లో ప్రస్తుతం మెదక్, జహీరాబాద్ ఉండగా కొత్తగా మరొకటి మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌ను విభజించి అదనంగా మరొకటి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాలను విభజించి ఒకట్రెండు ఏర్పాటుచేసే సూచనలున్నాయి.

మహిళలకు తొమ్మిది ఇవ్వాల్సిందే..

ప్రస్తుతం తెలంగాణ నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళా ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్య మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 9 మంది మహిళలు తెలంగాణ తరఫున లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పరిశీలిస్తే ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికల నాటికి 2026-27 జనాభా లెక్కలు అందుబాటులోకి రానున్నాయి. వాటి ఆధారంగానే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మహిళలకు సీట్లను రిజర్వు చేయనున్నారని అంచనా. ఈ లెక్కన రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి మహిళా ఎంపీలు లోక్‌సభకు వెళ్లే సూచనలున్నాయి. రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని మహిళలకు లోక్‌సభ నియోజకవర్గాలను రిజర్వు చేయనున్నారని అధికారవర్గాలు చెబుతున్నాయి. మహిళలకు పార్లమెంటు ఎన్నికల్లో ప్రధాన పార్టీలు పెద్దగా టికెట్లు ఇవ్వడం లేదు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముగ్గురికి, భాజపా, భారాస ఒక్కొక్కరికి మాత్రమే ఇచ్చాయి. 2029 ఎన్నికల్లో కచ్చితంగా ప్రతి పార్టీ వారికి 9 టికెట్లు ఇవ్వాల్సిందే. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే మహిళా నేతలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని సీనియర్ నేతలు అంటున్నారు. 2024 ఎన్నికల్లో అన్ని లోక్‌సభ స్థానాలకు కలిపి 12,459 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. వారిలో 8,360 మంది చివరికి బరిలో నిలిచారు. వీరిలో మహిళలు 800(9.6%) మంది మాత్రమే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతానికి వారి వాటా పెరగనుంది. దేశవ్యాప్తంగా 47.63 కోట్ల మంది మహిళా ఓటర్లున్నారు.

## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు..
## పవన్ కీలక ఆదేశాలు

అమరావతి: 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించినట్లు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, ప్రధానంగా నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి వివరాలపై సమీక్షించారన్నారు..అదే విధంగా గోదావరి పుష్కరాల నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు మంత్రి దుర్గేశ్ వెల్లడించారు. 2027 జూన్ 26 నుండి జులై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో వైభవంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించినట్లు మంత్రి దుర్గేశ్ చెప్పారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేశ్ పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులు, మంచినీరు, పారిశుద్ధ్యం మరియు విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు మంత్రి దుర్గేశ్ వెల్లడించారు. పుష్కర ఏర్పాట్లపై త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఈ భేటీలో క్షేత్రస్థాయి సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకోనున్నామన్నారు. రాష్ట్ర గౌరవం ఇనుమడించేలా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ గోదావరి పుష్కరాలను నిర్వహించబోతోందని మంత్రి దుర్గేశ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## తెలంగాణలో భగ్గుమన్న సూరీడు..
## పలు జిల్లాల్లో 43 డిగ్రీలు దాటిన ఎండలు

హైదరాబాద్: తెలంగాణలో భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మధ్యలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం నల్గొండ జిల్లా అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4 డిగ్రీలు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్‌లో 43.2 డిగ్రీలు నమోదు కాగా, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో కూడా పగటి ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలకు పైగా ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్నానికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోత కూడా అధికంగా ఉండటంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. రానున్న ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును కూడా దాటవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్ తెలుగు దినపత్రిక
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com

## సంపాదకీయం

# దేశానికి దిశ చూపేలా బిల్లులపై చర్చించాలి !

చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై పలు విమర్శలు వస్తున్నాయి. పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రాజకీయ పార్టీలతో పాటు, పౌరసమాజంలోనూ అనుమానాలు ఉన్నాయి. ఈ నెల 16 నుంచి పార్లమెంట్ మూడు రోజుల పాటు ప్రత్యేకంగా సమావేశం కాబోతున్నది. అందువల్ల ఈ విషయంలో అనుమానాలు నివృత్తి చేయాల్సి ఉంది. అనుమానాలు వ్యక్తం చేస్తున్న వారు, ఆందోళనలు చేస్తున్న వారు, విమర్శలు చేస్తున్న వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. పార్లమెంట్ వేదికగా సుదీర్ఘంగా చర్చించాలి. విపక్ష, స్వపక్ష నేతలు కూడా పరస్పర వివాదాల జోలికి పోకుండా ప్రజలకు అర్థమయ్యేలా సమగ్రంగా చర్చించాలి. అఖిలపక్ష సమావేశం కన్నా పార్లమెంటులో చర్చించడమే మేలు. ఎందుకంటే ఈ చర్చకు చట్టబద్దత ఉంటుంది. అలాగే సభ్యుల సూచనలు, సలహాలకు విలువ ఉంటుంది. ఎఐ వినియోగం, సాంకేతికత పెరిగిన ప్రస్తుత కాలంలో ఈ విషయాలపై వాటి సాయం కూడా పొందితే మంచిది. పార్టమెంటులో సుదీర్గ ఉపన్యాసాలకు తావులేకుండా, పరస్పర విమర్శలకు చోటు లేకుండా ఈ రెండు అంశాలపై సమగ్రంగా చర్చించాలి. దీనివల్ల ప్రజలకు కూడా అవగాహ కలిగేలా ఉండాలి. రాజకీయపార్టీలు స్వార్థ రాజకీయాలను పక్కన పెట్టి, ఈ అంశాలపై ఓ ఏకాభిప్రాయం వచ్చేలా చూడాలి. ఎందుకంటే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉంది. నిజానికి మొన్నటి సార్వత్రిక ఎన్నికలకు ముందే పార్లమెంట్ ముందుకు వచ్చింది. అప్పుడే ఇది చట్టంగా మారివుంటే బాగుండేది. కొత్తగా జనాభా లెక్కల తరవాత దీనిని అమలు చేస్తామని గతంలో బిల్లు ప్రవేశ పెట్టినప్పుడు ప్రభుత్వం చెప్పింది. ఇప్పుడు 2011 జనాభా లెక్కల ప్రకారం అమలు చేస్తే అన్యాయం చేసినట్లు అవుతుంది. 2029లో సార్వత్రిక ఎన్నికలు జరిగితే ప్రజాస్వామ్యం మరింతగా వికసిస్తుందని, బలోపేతం అవుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. విధాన నిర్ణయాల్లో మహిళలు ఎప్పుడైతే క్రియాశీలంగా వ్యవహరిస్తారో అప్పుడు వికసిత్ భారత్ దిశగా ప్రయాణం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని 2029 ఎన్నికల నుంచి అమలు చేసేందుకు 16వ తేదీ నుంచి 3 రోజులపాటు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో సవరణలను చేపట్టనున్న నేపథ్యంలో దేశంలోని మహిళలకు ప్రధాని ప్రత్యేకంగా లేఖ రాశారు. నిజానికి ఇప్పటికే మహిళల రిజర్వేషన్లు అమలు జరిగివుండాల్సింది. అనేక రంగాల్లో మహిళలు రాణిస్తున్నందున చట్టసభల్లోనూ వారి భాగస్వామ్యం పెరగాల్సిందే. చట్టసభల్లో వారి వాణి బలంగా వినిపిస్తే ప్రజాసామ్యం మరింత బలోపేతం అవుతుంది. అయితే లోక్‌సభ సీట్లు పెరిగితేనే మహిళల రిజర్వేషన్లు అమలు సులువవుతందని ప్రభుత్వ వాదనగా ఉంది. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి వీలుగా ఇప్పుడున్న లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్య 550ని గరిష్ఠంగా 850 వరకూ పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం 2027 జనాభా లెక్కల నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ అందుకు సంబంధించి లెక్కలు వెలువడటానికి ఆలస్యమవుతుందన్న ఉద్దేశంతోనే ముందస్తు గా ఈ రాజ్యాంగ సవరణ బిల్లులను తీసుకొస్తున్నట్లు కేంద ప్రభుత్వం పేర్కొంది. దాని ప్రకారం వెళ్తే ప్రజాస్వామ్య పక్రియలో మహిళా భాగస్వామ్యం పెంచడంలో జాప్యం జరుగుతుందని అభిప్రాయపడింది. కేంద్ర ప్రభుత్వం ఏ జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోనేదీ ఈ బిల్లులో చెప్పలేదు. అయితే డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రతిపాదించిన బిల్లులో ఆ కమిషన్ ఏర్పాటయ్యే నాటికి అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజకవర్గాలను పునర్విభజించనున్నట్లు పేర్కొంది. అంటే దాని ప్రకారం ప్రస్తుతం అందుబాటు లో ఉన్న తాజా జనాభా లెక్కలు 2011వే కాబట్టి వాటి ప్రాతిపదికనే నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశముంది. 850 సీట్లను ఏ ప్రాతిపదికన పెంచబోయేదీ ఈ బిల్లులో స్పష్టత ఇవ్వకున్నా పార్లమెంటులో చర్చ సందర్భంగా ప్రభుత్వం చెప్పే అవకాశం ఉంది. అప్పుడు అన్ని రాష్ట్రాల్లో స్థానాలను 50శాతం పెంచుతామని చెబితే ఏయే రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంటు సీట్లు ఎన్ని పెరుగుతాయన్న దానిపై స్పష్టత వస్తుంది. ఆ రాష్ట్రాలకు వచ్చిన సీట్లను అంతర్గతంగా పునర్విభజించుకోవడానికి 2011 జనాభా లెక్కలు పనికొస్తాయి. అలా కాకుండా దేశం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకొని 2011 జనాభా లెక్కల ఆధారంగానే పునర్విభజన చేపట్టాలని నిర్ణయిస్తే డీలిమిటేషన్ కమిషన్ అంతిమంగా నివేదిక ఇచ్చేంత వరకూ ఏ రాష్ట్రం లో ఎన్ని సీట్లు పెరుగుతాయన్న దానిపై స్పష్టత వచ్చే అవకాశం లేదు. నియోజకవర్గాల పునర్విభజన విషయంలో కమిషన్‌కు సహాయ పడటానికి ప్రతి రాష్ట్రం నుంచి 10 మందిని నియమిస్తారు. ఇందులో ఐదుగురు ఎంపీలు, ఐదుగురు ఎమ్మెల్యేలుంటారు. లోక్‌సభ సభ్యులను లోక్‌సభ స్పీకర్, ఎమ్మెల్యేలను అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేస్తారు. నియోజకవర్గాల పునర్విభజన కోసం రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్, సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియా, వారి నామినీలను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులను, భౌగోళిక పరిస్థితులపై అవగాహన ఉన్న నిపుణులను, ఇతరత్రా అవసరమైన వారిని పిలిచి మాట్లాడే అధికారం ఈ కమిషన్‌కు ఉంటుంది. కమిషన్ సభ్యుల్లో భిన్నాభిప్రాయాలు ఏర్పడితే మెజారిటీ సభ్యుల అభిప్రాయం చెల్లుబాటవుతుంది. డీలిమిటేషన్ బిల్లులో ఈ కమిషన్ ఏర్పాటు కావడానికి ముందు అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం నియోజక వర్గాల పునర్విభజన జరుగుతుందని చెప్పింది తప్పితే స్పష్టంగా ఫలానా జనాభా లెక్కల ప్రాతిపదికన అని చెప్పలేదు. 2027 జనాభా లెక్కల సేకరణ జరుగుతున్న తరుణంలో 2011 జనాభా లెక్కలను ఎలా ప్రాతిపదికగా తీసుకుంటారని ప్రతిపక్షాలు ప్రశ్నించే వీలుండటంతో ఆ దాడి నుంచి తప్పించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తెలివిగా కమిషన్ ఏర్పాటయ్యే నాటికి ముందున్న జనాభా లెక్కల ప్రకారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పినట్లు కనిపిస్తోంది. అయితే ఇవన్నీ ఒక పజిల్‌లలాగా కనిపిస్తున్నాయి. అందువల్ల పార్లమెంట్ చర్చకు విలువ ఉంటుంది. అఖిలపక్షం కన్నా పార్లమెంటులో చేస చర్చలకే ప్రాధాన్యం ఉంటుంది. విపక్షాలకు ఉన్న అనుమానాలను తీర్చాల్సిన బాధ్యత అధికార పక్షానిది. అనుమానాలను సహేతుకంగా ప్రస్తావించడం ద్వారా విపక్షాలు తమవంతుగా కృషి చేయాలి. అప్పుడే ఈ రెండు బిల్లులపై సమగ్ర చర్చకు అవకాశం ఉంటుంది.

# మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

### రెంటికీ లింకుపై విపక్షాల ఆందోళన

### పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం

న్యూఢిల్లీ,: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తున్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ రెంటిని కలపడంపైనా మండిపడు తున్నారు. అలాగే ఇదే విషయమై సామాజిక ఉద్యమకారులు ప్రశ్నించారు. కేంద్రం ఎంపీలకు పంపిణీ

చేసిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై వివిధ పక్షాలకు చెందిన నాయకులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులో మొత్తం లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించినప్పటికీ వాటిని రాష్ట్రాల వారీగా ఏ ప్రాతిపదికన అమలు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చెప్పినట్లు ఇప్పుడున్న సీట్లను 50శాతం పెంచితే అన్ని రాష్ట్రాల్లోనూ ఆ వాటా ప్రకారం పెరుగుతాయి. అలాకాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం... అంటే 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గాలను పునర్విభజిస్తే కుటుంబ నియంత్రణ అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని వాదిస్తున్నారు. ఇది ఆందోళనకరంగా కనిపిస్తోందని దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు పలువురు పేర్కొంటున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే నియోజవర్గాల పునర్విభజన చేయకతప్పదన్న అభిప్రాయాన్ని తప్పుపట్టారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యకు అనుగుణంగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చలు జరపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లు ముసాయిదా ప్రతులను ఇంతవరకు ఎంపీలకు ఇవ్వకపోవడాన్ని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడాన్ని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న సీట్లను 543 నుంచి 850 వరకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీస్తున్నారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచితే అది ప్రపంచంలోనే అతి భారీ చట్ట సభ అవుతుందని అన్నారు. అది సభాకార్యకలాపాల నిర్వహణపై ప్రభావం చూపుతుందని తెలిపారు. గతంలో సభ ఏడాదిలో 150 రోజుల పాటు సభ జరిగేదని ఇప్పుడు 55 రోజులపాటు కూడా జరగడం లేదని గుర్తు చేశారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉప కోటా లేకపోవడాన్ని కొందరు ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లలో

కూడా రిజర్వేషన్ల గురించి అప్పుడే చర్చ మొదలయ్యింది. మొత్తంగా ఈ విషయంలో పార్లమెంటులో చర్చ జరిగితే తప్ప సరైన సమాధానం రాదు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే పునర్విభజన పక్కన పెట్టాలని అంటున్నారు.

# డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

### దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు

### బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ హెచ్చరిక

హైదరాబాద్: నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ పక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. 'ఢిల్లీ పాలకులు మా మాట వినాలని, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నాం' అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# భారీ జీతంతో సమ్మతృప్తే!

## ఐటీ జాబ్ మార్కెట్లో భిన్నమైన పరిస్థితి ఆసక్తి కలిగిస్తున్న 'బ్లైండ్'యాప్ నివేదిక




భారీ జీతం అందుకోవాలి. వృత్తిపరంగా ఎదగాలి. ప్రపంచస్థాయిలో గుర్తింపు రావాలి. ఇదీ ఓ సగటు భారతీయ టెకీ మనసులో మాట. ఇందుకోసం అంతర్జాతీయ దిగ్గజ టెక్ కంపెనీల్లో పనిచేయాలని ఆకాంక్షిస్తుంటారు. అయితే అధిక వేతనం ఎల్లప్పుడూ పని ప్రదేశంలో సంతృప్తిని, వృత్తిపరమైన ఎదుగుదలను అందించలేదని ఒక నివేదిక వెల్లడించింది. ప్రధాన సంస్థలలో పని వాతావరణాన్ని అంచనా వేయడానికి 40,686 మంది ఉద్యోగుల రేటింగ్స్, జీతాల డేటాను విశ్లేషించిన అమెరికాకు చెందిన ప్రొఫెషనల్ కమ్యూనిటీ యాప్ 'బ్లైండ్'ఓ నివేదికను రూపొందించింది. పని ప్రదేశంలో సంతృప్తి, వృత్తిపరమైన ఎదుగుదల అవకాశాలు, మేనేజ్‌మెంట్ పనితీరును విశ్లేంచింది. మన దేశంలో టెకీలు కోరుకుంటున్న ప్రధాన కంపెనీల జాబితా ఒకటైతే.. భారత్‌లో పనిచేయడానికి ఉత్తమ సంస్థలుగా పేరొందిన సంస్థల జాబితా వేర్వేరుగా ఉండటం ఆసక్తికరం.

### భారీ వేతనం ఉంటే..

పోటీతత్వంతో కూడిన నేటి ఉద్యోగ మార్కెట్‌లో సరైన పని ప్రదేశాన్ని ఎంచుకోవడం మునుపటి కంటే ఇప్పుడు చాలా కీలకంగా మారింది. చాలామంది నిపుణులు కేవలం జీతంపైనే కాకుండా వృత్తిపరమైన ఎదుగుదల, పని సంస్కృతి, దీర్ఘకాలిక స్థిరత్వంపై కూడా దృష్టి సారిస్తున్నారు. పని--జీవిత సమతుల్యత ఉద్యోగుల సంతోషాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుందని తేలింది. కెరీర్‌ను మార్చుకోవాలనుకునే నిపుణులకు జీతం ఇప్పటికీ ప్రధాన ఆకర్షణగా ఉంది. అంటే భారీ వేతనం ఉంటే కెరీర్ మారేందుకు సిద్ధం అన్నమాట.

### టాప్--15లో లేవు..

భారత్‌లో టెకీలు, జాబ్ మార్కెట్లోకి అడుగుపెట్టేవారు అత్యధికంగా కోరుకునే సంస్థల జాబితాను బ్లైండ్ రూపొందించింది. ఇందులో అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, అట్లాసియన్, ఫ్లిప్‌కార్ట్, జీటా, ఇన్‌మోబి, టెకియన్ కార్ప్, ఉబర్, వాల్‌మార్ట్, సేల్స్‌ఫోర్స్, ఎడోబ్, మెటా, ఒరాకిల్, షేర్‌చాట్ ముందు వరుసలో ఉన్నాయి. బ్లైండ్ బెస్ట్ వర్క్‌ప్లేసెస్ జాబితాలో అత్యుత్తమ రేటింగ్ పొందిన టాప్--10 కంపెనీల్లో ఎన్విడియా, గూగుల్, యాపిల్, అకామాయ్ టెక్నాలజీస్, వీఎమ్‌వేర్, ఎడోబ్, టార్గెట్, క్రెడ్, నోకియా, థాట్‌వర్క్స్ ఉన్నాయి. గూగుల్, ఎడోబ్ మాత్రమే ఈ రెండు జాబితాల్లోనూ నిలిచాయి. అమెజాన్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి భారీ వేతనాలు ఇచ్చే కంపెనీలు టాప్--15 బెస్ట్ వర్క్‌ప్లేసెస్‌లో చోటు సంపాదించుకోలేకపోయాయి. ఎన్విడియా, యాపిల్, అకామాయ్ టెక్నాలజీస్ వంటి అత్యుత్తమ రేటింగ్ పొందిన సంస్థలకు అత్యధికంగా కోరుకునే కంపెనీల జాబితాలో స్థానం దక్కలేదు.

### ఉద్యోగుల సెంటిమెంట్..

అధిక జీతాలు ఎల్లప్పుడూ ఉద్యోగ సంతృప్తితో సంబంధం కలిగి ఉండవని ఈ అధ్యయనం ద్వారా వెల్లడైంది. అత్యధిక జీతాలు ఇచ్చే కంపెనీలలో మూడో వంతు కంటే తక్కువ మాత్రమే అత్యుత్తమ రేటింగ్ పొందిన పని ప్రదేశాల జాబితాలో ఉన్నాయి. ఆర్థిక ప్రోత్సాహకాలు ప్రతిభను ఆకర్షించినప్పటికీ ఉద్యోగులను నిలుపుకోవడంలో, వారిని ఉత్సాహపరచడంలో పని సంస్కృతి, నాయకత్వం కీలక పాత్ర పోషిస్తాయని నిరూపితమైంది. ఉద్యోగుల సంతృప్తి అనేది కేవలం జీతంపై మాత్రమే కాకుండా ఇతర అంశాలపై ఆధారపడి ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఉద్యోగి ఏదేని కంపెనీలో దీర్ఘకాలం కొనసాగాలంటే నాయకత్వ నాణ్యత, వృత్తిపరమైన అభివృద్ధి, పని సంస్కృతి ఇప్పటికీ కీలకమైనవి. ఆర్థిక ప్రోత్సాహకాలతోపాటు సహాయక వాతావరణాన్ని సమతుల్యం చేసే సంస్థలు మాత్రమే నైపుణ్యం కలిగిన నిపుణులను నిలుపుకోగలవు, బలమైన ఖ్యాతిని నిర్మించుకోగలవని తెలిపింది.

### ఏడాదిలో భారత్‌లోని నిపుణులు వెతికిన కంపెనీలు, పదాలు...

అత్యధికంగా వెతికిన కంపెనీల పేర్లు: మైక్రోసాఫ్ట్, గూగుల్, ఉబర్, అమెజాన్, సేల్స్‌ఫోర్స్, మెటా, అట్లాసియన్, యాపిల్, క్వాల్‌కామ్, ఈబే. తరచూ సెర్చ్ చేసిన పదాలు: లేఆఫ్, ఆఫర్, హెచ్--1బీ, మెటా ఇండియా, గూగుల్ ఇండియా, మెటా లండన్.

# వేదకాలం నుంచి నేటి కాలం వరకు.. విదుషీమణులు



ప్రాచీన కాలంలో, అంటే క్రీ.పూ.3000 సంవత్సరాల ముందు కాలం నుండీ కూడా మన దేశం 'స్త్రీ విద్య' ను ప్రోత్సహించి, గౌరవించింది. ఆనాటి నుండీ స్త్రీలు లౌకిక, అలౌకిక విద్యలలో పురుషులతో సమానంగా నిలుస్తున్నారు. వేదకాలంలోనే మహిళలు ఉపనయన సంస్కారాలు పొంది, వేదాధ్యయనం చేశారు. వేద మంత్రాలు దర్శించారు. తపస్వినులు, ఆధ్యాత్మికవేత్తలైన స్త్రీలను 'ఋషికలు' అంటారు. రోమశ, గార్గి వాచక్నవి, విశ్వవర, ఆత్రేయి, లోపాముద్ర, ఇంద్రాణి, మైత్రేయి, అపాల, యామి, పౌలోమి, ఘోష, ఖోన, జుహు, వాగంభ్రణి, సావిత్రి, దేవజామి, కక్షివతి, దక్షిణ ప్రజాపత్య, విశ్వావతి, పశుక్రపత్ని, దేవసూని, శాశ్వతి, అంగీరసి, శ్రీ లక్ష్మి, నోధ, శిఖతన్వరి, గౌపాయన, ఉభయభారతి, విజ్జిక, కామాక్షి వంటి స్త్రీలందరూ ఋషికలే. గృహజీవనానికి స్త్రీయే పునాది అని ఋగ్వేదం చెప్పింది. శక్తిస్వరూపిణి అయిన స్త్రీని గౌరవించి, ఆరాధించే సంస్కృతి మనది. పరబ్రహ్మలోని స్త్రీ పరమైన గుణాలు, శక్తులు కలిసి 'స్త్రీ దేవతలు' అవతరించారు. వారి గురించి తెలుసుకుందాం.

లోపాముద్ర: అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర సంస్కృత, తమిళ భాషలలో నిష్ణాతురాలు. లోపాముద్ర అంటే తనలో తానే లీనమైన ఆత్మనిష్ఠాపరురాలు అని అర్థం. అగస్త్యునికి, లోపాముద్రకు మధ్య జరిగిన సంవాదం, లోపాముద్ర పాండిత్యం, గెలుపును ఋగ్వేదం ప్రశంసించింది. అగస్త్యుడు, లోపాముద్ర సాహచర్యంలో సంవాదాలలో భౌతిక, ఆధ్యాత్మిక జీవితంలోని పవిత్రతను, పూర్ణత్వాన్ని గ్రహించాడని చెబుతారు.

ఘోష: ఆమె దుర్గతమసుని మనుమరాలు. కక్షివంతుని కూతురు. దేవ వైద్యులైన అశ్వనీ కు మారులను స్తుతిస్తూ ఆ తండ్రీ కుమా రులు అనేక శ్లోకాలు రచించారు. పదవ ప్రకరణంలోని కొన్ని శ్లోకాలను తండ్రి, తాతగార్లతో సమానంగా ఘోష రచించింది. వాటిలోని ఒక శ్లోకంలో ఆమె అశ్వినులను వివాహం చేసుకోవాలనే ఆకాంక్షను వెల్లడిస్తుంది. కుష్ఠువ్యాధిచే కురూపి అయిన ఆమెను అశ్వనీ దే వతలు తమ వైద్యంతో ఆరోగ్యవంతు రాలిని, అందగత్తెను చేసి పెండ్లి చేసు కొంటారు.

ఋగ్వేద మంత్ర ద్రష్ట మైత్రేయి: గొప్ప తాత్వికురాలు, ఋషిక అయిన మైత్రేయి కూడా ఋగ్వేద మంత్రాలను దర్శించింది. ఆమె తన భర్త అయిన యాజ్ఞవల్క్యుని వ్యక్తిత్వ, ఆధ్యాత్మిక ఆలోచనలను పరిణితి చెంచేలా చేయడంలో ప్రధానపాత్ర వహించింది. యాజ్ఞవల్క్యునికి కాత్యాయని అనే రెండవ భార్య కూడా ఉంది. ధర్మశాస్త్రాలు, వేదాలు బాగా చదివి, బ్రహ్మవాదినిగా మైత్రేయి ఘనత వహిస్తే, కాత్యాయని ఒక సాధారణ ఇల్లాలిగానే ఉండింది. ప్రాపంచిక చింతనలు విడిచి, సన్యాసికి అనువైన స్వీయ నియంత్రణ, సన్యాసి ప్రతిజ్ఞా పాలన చేయదలచి యాజ్ఞవల్క్యుడు ఒకరోజు తన ప్రాపంచిక ఆస్తిపాస్తులను తన ఇద్దరు భార్యలకు పంచదలిచాడు. ప్రపంచ సంపద తనకు శాశ్వతత్వాన్ని, ముక్తిని ఇవ్వలేదని భావించి మైత్రేయి తన భర్త నుండి కేవలం ఆధ్యాత్మిక జ్ఞానాన్ని, ముముక్షత్వానికి కావలసిన శిక్షణను కోరుకొని మరీ పొందింది.

బ్రహ్మజ్ఞాని గార్గి: వాచక్న మహర్షి కూతురు, వైదిక ప్రవక్త గార్గి. మానవ అస్తిత్వానికి, ఉనికికి, జీవితానికి మూలమేమిటి అనే అంశంపై గార్గి అనేక వేదమంత్రాలను దర్శించింది. ఎందరో వేదాంత వేత్తలను వాదంలో గెలిచిన యాజ్ఞవల్క్యునికి ఆత్మానాత్మల విచారం గురించి, బ్రహ్మ జ్ఞానం గురించి అనేక ప్రశ్నలను సంధించి గార్గి ఆయనను ముప్పుతిప్పలు పెట్టింది.

గొప్ప విజ్ఞాని ఉభయభారతి: మధ్యయుగంలో తత్వవేత్త, మీమాంస, అద్వైత దర్శనాలలో ప్రవీణుడైన మండనమిశ్రుని భార్య అయిన ఉభయభారతి ఒక గొప్ప విజ్ఞాని. శ్రీ ఆదిశంకరాచార్యులకు, మండనమిశ్రునికి మధ్య జరిగిన అద్వైత సిద్ధాంత సంబంధిత వాదోపవాదాలకు ఆమె న్యాయనిర్ణేతగా వ్యవహరించింది. పక్షపాత రహితంగా ఆ వాదనలలో తన భర్తను కాక, ఆదిశంకరులనే విజేతగా ప్రకటించిన విదుషీమణి ఆమె.

ఆళ్వార్ ఆండాళ్: ఇంకా ఆ యుగంలో 'తిరుప్పావై' అనే భక్తి గీతాలను వ్రాసిన మొదటి మహిళా ఆళ్వార్ అండాళ్. స్త్రీ స్వేచ్ఛ, వ్యక్తిత్వంపై కవితలు వ్రాసిన కర్నాటకలోని శివ భక్తురాలు అక్క మహాదేవి. రాజస్థాన్ లోని కృష్ణ భక్తురాలు, సాంఘిక దురాచారాలను ప్రతిఘటించిన కవయిత్రి మీరాబాయి, సరళ భాషలో వేదాంతపరమైన నిగూఢార్థాలు చాటిచెప్పిన తత్వవేత్త లాలాదేవి, గ్రామీణుల సాధారణ జ్ఞానాన్ని వేదాంత విజ్ఞానంతో అనుసంధిస్తూ రచనలు చేసిన తమిళ కవయిత్రి అవ్వయ్యార్, ఇంకా సక్కుబాయి, ముక్తాబాయి, మదాలస, ఈ మధ్యకాలంలో తరిగొండ వెంగమాంబ, ఆదోని లక్ష్మమ్మ, జిల్లెళ్ళమూడి అనసూయమ్మ మొదలైన యోగినులు, అంతర్బుద్ధి సిద్ధులైన మహిళలు ఎందరో ఉన్నారు.

విజ్జిక: దండి మహాకవి తన ఒక రచనలో సరస్వతీ దేవిని తెలుపు దేహరంగు చ్ఛాయ కలదిగా వర్ణించాడు. విజయాంబిక (విజ్జిక) అనే కవయిత్రి నలుపురంగుతో ఉండేది. ఆమె దండి అభిప్రాయాన్ని ప్రతిఘటించింది. నల్లని దేహకాంతిగల అపర సరస్వతినైన నా గురించి తెలుసుకోకుండా సరస్వతి ధవళవర్ణిని అని దండికవి ఎలా అంటాడని ఆమె ప్రశ్నించింది. స్త్రీల ఆత్మవిశ్వాసానికి విజ్జిక ఒక ప్రతీక. ఇంకా గంగాదేవి, తాళ్ళపాక తిమ్మక్క, మొల్ల వంటి కవయిత్రులు రసవత్తర కావ్యాలు వెలువరించి పురుషులతో సమానంగా నిలిచినవారే.

ఆధ్యాత్మిక వేత్త గౌతమి: బౌద్ధయుగంలో గౌతమ బుద్ధుని పెంపుడు తల్లి అయిన మహా ప్రజావతి గౌతమి ఒక ఆధ్యాత్మికవేత్త. ఆమె కాక బౌద్ధ వేదాంత ధ్యాన సన్యాసినులు ఖేమ, ఉప్పలావన, రెండవ భాస్కరుని కూతురైన లీలావతి వంటి ఆధ్యాత్మిక వేత్తలైన స్త్రీలుండేవారు.

# చందమామ చిక్కేదెవరికి?

## మానవసహిత ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్న చైనా అమెరికాకు పోటీగా పరిశోధనలు ఒక్కసారిగా పెరిగిన అంతరిక్ష పరిశోధనల పోటీ



దశాబ్దాల తర్వాత జాబిల్లిపై అమెరికా దృష్టిసారించిన మరుక్షణమే చైనా సైతం తన అంతరిక్ష పరిశోధనలకు చందమామను కేంద్రస్థానంగా మార్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రత్యేకంగా రాకెట్లు, వ్యోమనౌకలు, ల్యాండర్‌లతో రంగంలోకి దిగేందుకు సమాయత్తమవుతోంది. 2028కల్లా చంద్రునిపై 'ఆర్టిమిస్ ప్రోగ్రామ్'ద్వారా మానవసహిత ప్రయోగాలను పునరుద్ధరించాలని అమెరికా ప్రణాళికలు రచించింది. ప్రతిరంగంలో అమెరికాతో పోల్చుకుని ఆ దిశగా పావులు కదిపే చైనా ఇప్పుడు శాస్త్ర పరిశోధనలు, అంతరిక్ష వనరులు, దేశ ప్రయోజనాలే పరమావధిగా ముందడుగు వేస్తోంది. దీంతో ఒక్కసారిగా చంద్రుని కేంద్రంగా అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధనల పోటీకి తెరలేచింది.

### చైనా ఎలా సంసిద్ధమవుతోంది?

మానవసహిత ప్రయాణాలు సాధ్యమయ్యేలా అత్యంత శక్తివంతమైన లాంగ్ మార్చ్--10 రాకెట్‌ను చైనా అభివృద్ధి చేస్తోంది. దీనికి సంబంధించిన తక్కువ కాలానికి ఇంజిన్‌ను పూర్తి లేదా పాక్షిక సామర్థ్యంతో మండించడం(క్రిటికల్ స్టాటిక్ ఫైర్), ప్రయోగశాలలో రాకెట్ సామర్థ్యాన్ని పరీక్షించడం(లో ఆటి?టట్యూట్ డెమోన్?రస్ట్రేషన్ టెస్ట్)లను విజయవంతంగా పూర్తిచేసింది. వ్యోమగాములను మోసుకెళ్లే పునర్ వినియోగ క్యాపరీ?స్రయల్ 'ది మెంగ్‌జోయూ'ను చైనా పరీక్షిస్తోంది. ఈ క్యాపూస్‌ల్‌తో డైనమిక్ ప్రెషర్ విధానంలో వ్యోమగాములు తప్పించుకునే టెస్ట్‌ను విజయవంతంగా పరీక్షించింది. ప్రయోగవేదిక నుంచి వ్యోమనౌక గాల్లోకి లేచేటప్పుడు హఠాత్తుగా అగ్నిప్రమాదం లాంటివి జరిగితే వ్యోమగాములు తప్పించుకునే మ్యాక్స్ క్యూ అబోర్ట్ టెస్ట్‌నూ విజయవంతంగా పరీక్షించింది. చైనా వ్యోమగాములు(ట్రైకోనాట్స్)ను చందమామ ఉపరితలం మీదకు తీసుకెళ్లే తిరిగి కక్ష్యలోకి తీసుకొచ్చే 'ది లాన్యే లూనార్'ల్యాండర్‌నూ చైనా పరీక్షిస్తోంది. లాన్యే అంటే చందమామను హత్తుకోవడం. ఈ పదాన్ని మావో జెడాంగ్ తన కవితలో తొలిసారిగా ఉపయోగించారు. సిమ్యులేషన్ సమయంలో ఈ ల్యాండర్.. ల్యాండింగ్, టేకాఫ్‌లను అత్యంత ఖచ్చితత్వంతో పూర్తిచేసిందని చైనా ఇటీవలే ప్రకటించింది. చందమామపైకి లాంగ్ మార్చ్--10 రాకెట్ పలు మార్పు ప్రయోగాలకు అనువుగా ప్రయోగవేదికలను విస్తరిస్తున్నారు. లాంచ్‌ప్యాడ్లు, ట్రాకింగ్ స్టేషన్లు, అనుబంధ భవనాలను నిర్మిస్తున్నారు. దీంతో హైనాన్‌లోని వెన్‌చాంగ్ స్పేస్‌క్రాఫ్ట్ లాంచ్‌సైట్‌లో నిర్మాణపనులు వేగవంతమయ్యాయి. వ్యోమగా ములతో కూడిన డీప్--స్పేస్ ఆపరేషన్ల కోసం ఇతర కీలక వసతులను అందుబాటులోకి తెస్తున్నారు.

### చందమామ మీదకు వెళ్లేది ఎప్పుడు?

మరో నాలుగేళ్లలో తొలి వ్యోమగాముల బృందాన్ని చందమామ మీద దింపాలని చైనా లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకు సంబంధించిన పనులన్నీ షెడ్యూల్ ప్రకారం చకచకా జరుగుతున్నాయని 'ది చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ'ప్రకటించింది. "ప్రయోగ పరీక్షలు అన్నీ విజయవంతమవుతూ, మౌలికసదుపాయాల కల్పన పూర్తవుతూ లక్ష్యాన్ని చేరువచేస్తున్నాయి. అంతరిక్ష చరిత్రలో సరికొత్త మైలురాయిని త్వరలో చేరుకోబోతున్నాం"అని స్పేస్ ఏజెన్సీ పేర్కొంది.

### ఈ ఏడాది బిజీబిజీ..

2026లో బిజీ షెడ్యూల్‌తో చైనా దూసుకుపోతోంది. సొంతంగా నిర్మించుకున్న అంతరిక్ష కేంద్రం 'తియాన్‌గాంగ్ స్పేస్ స్టేషన్'కు రెండు సార్లు వ్యోమగాములను పంపనుంది. సరకులను పంపేందుకు ఒక ప్రయోగం చేయనుంది. ఒక ట్రైకోనాట్‌ను ఒక పూర్తి ఏడాదికాలం అక్కడే ఉంచనుంది. తద్వారా సుదీర్ఘకాలంపాటు అంతరిక్షంలో ఉంటే ఎలాంటి అనారోగ్య పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావొచ్చు? అనే అంశంపై అధ్యయనంచేయనుంది. కొత్త మాడ్యూళ్లను తీసుకెళ్లేందుకు హాంకాంగ్, మకావూ నుంచి ఇద్దరు ట్రైకోనాట్స్‌ను అంతరిక్ష కేంద్రానికి పంపనుంది. పాకిస్తాన్ వంటి అంతర్జాతీయ భాగస్వామ్య దేశాల వ్యోమగాములకు చైనా స్పేస్‌స్టేషన్ స్వాగతం పలకనుంది.

### నాసా మిషన్‌లో వచి?చన మార్పులేంటి?

2027లో దిగువ కక్ష్యలో తొలుత ఒక వ్యోమనౌకను ప్రయోగించనుంది. వాణిజ్య ల్లు?ండర్లతో అనుసంధానం కోసం రిహార్సల్ చేయనుంది. ఈ కమర్షియల్ ల్యాండర్లను స్పేస్‌ఎక్స్, బ్లూ ఆరిజిన్ సంస్థలు రూపొందిస్తున్నాయి. మరో రెండు నెలల్లో ఆర్టిమిస్--2 ప్రాజెక్ట్‌ను అమెరికా చేపట్టనుంది. వ్యోమగాములతో బయల్దేరే వ్యోమనౌక చంద్రుని సమీప కక్ష్యలోకి వెళ్లి అక్కడి నుంచి జాబిలి సమాచారాన్ని సేకరిస్తుంది. చంద్రుని స్వల్ప గురుత్వాకర్షణ శక్తినే వడిసెలా వాడుకుని తిరిగి భూమి దిశలో పయనించనుంది. 2027లో ఆర్టిమిస్--3 ఆ తర్వాత 2028లో ఆర్టిమిస్--4ను అమలుచేయనుంది.

### మళ్లీ చందమామపై దృష్టి ఎందుకు సారించారు?

చంద్రుని దక్షిణ ధ్రువంలోని బిలాల్లో ఘనరూప నీరు ఉందని తాజా పరిశోధనలు బలంగా చెబుతున్నాయి. ఈ నీటిని ఉపయోగించుకుని అక్కడ వ్యోమగాముల కోసం స్థిరనివాసాలు ఏర్పాటుచేయాలని అమెరికా భావిస్తోంది. అక్కడి నుంచి అంతరిక్ష ప్రయోగాలు చేయాలని ఆశిస్తోంది. అరుణ గ్రహంపై యాత్రకు జాబిలిని మజిలీగా మార్చుకోవాలని భావిస్తున్నారు. హీలియం--3 అనే అరుదైన ఐసోటోప్ చందమామపై సమృద్ధిగా ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. వ్యోమగాములు అక్కడ స్థిరపడ్డాక ఈ ఐసోటోప్‌తో కేంద్రక సంలీన చర్య ద్వారా నిరంతరాయంగా కరెంట్‌ను ఉత్పత్తిచేసి విద్యుత్ అవసరాలను తీర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
తెలుగు దినపత్రిక
epaper: https://epaper.mahinewsindia.com


# రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలు పక్కాగా ఉండాలి

## రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 15: రీ సర్వే పట్టాదారు పాసుపుస్తకాలు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహసీల్దార్ ను ఆదేశించారు. బుధవారం నందిగాం మండలం సుభద్రాపురం, కాపుతెంబూరు గ్రామంల్లో రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలను ఇంటింటికి వెళ్లి స్వయంగా ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పట్టాదారు పాసు పుస్తకాలలో భూ పరిమితి, ఆధార్, ఫోన్, పేర్లు, తదితర వివరాలను ఆయన పరిశీలించారు. రీ సర్వే పట్టాదారు పాసు పుస్తకాలలో ఉన్న వివరాలు సరిపోయింది లేనిది సంబంధిత రైతులతో మాట్లాడి అడిగి తెలుసుకున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చినందుకు రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు.

# స్వీయ గణన ప్రక్రియను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 15: జనగణన-2027లో భాగంగా తొలిసారిగా ప్రవేశపెట్టిన 'స్వీయ గణన' ప్రక్రియను జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 16 నుండి 30 వరకు నిర్వహించే 15 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజలు https://se.census.gov.in పోర్టల్ ద్వారా తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలా విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఈ ప్రక్రియను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రతినిధులు, ప్రముఖ వ్యక్తులు, ప్రభుత్వ సిబ్బంది భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ప్రతిరోజూ కనీసం 10 నుండి 20 మంది వ్యక్తులు స్వీయ గణన చేసుకునేలా సిబ్బంది చొరవ తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఏప్రిల్ 26న జిల్లా కేంద్రం, మున్సిపాలిటీలలో 'సెన్సస్ 5కె రన్' నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని, మీడియా, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా ఈ కార్యక్రమానికి విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తిగా స్వచ్ఛందమైనదని, ఎవరినీ నిర్బంధించకూడదని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఖైదీల హక్కుల రక్షణ మనందరి బాధ్యత

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 15: జైళ్లలో విచారణ ఎదుర్కొంటున్న ముద్దాయిల హక్కులను కాపాడటంతో పాటు, వారికి చట్టపరమైన వెసులుబాటు కల్పించడం ద్వారా సత్వర న్యాయం అందించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బుధవారం ఆయన జిల్లా కోర్టు ప్రాంగణంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులు, న్యాయవాదులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ ద్వారా బెయిల్ లభించినా బయటకు రాలేకపోతున్న వారు, మహిళలు, మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ముద్దాయిల కేసులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. రాబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంపై దిశానిర్దేశం చేస్తూ.. గతంలో మాదిరిగానే ఈసారి కూడా రికార్డు స్థాయిలో కేసులను రాజీ మార్గంలో పరిష్కరించాలని పిలుపునిచ్చారు. రాజీ ద్వారా కక్షిదారులకు సమయం, ధనం ఆదా అవ్వడమే కాకుండా జిల్లాలో నేరాల నిష్పత్తి తగ్గుతుందని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యంగా ఇన్సూరెన్స్ కంపెనీలు, పోలీసు అధికారులు సమన్వయంతో పనిచేసి బాధితులకు సత్వర పరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎల్ఎస్ఎ కార్యదర్శి హరిబాబు, అదనపు ఎస్పీ పి. శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం. శ్రీధర్, ఎస్.డి.పి.ఓ వి. వెంకటప్పరావు, అదనపు ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ ఎల్. నాగభూషణ రావు, జైలు అధికారులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో ఇంటర్ ఫలితాల సందడి

## జిల్లాలో 88 శాతం ఉత్తీర్ణత

శ్రీకాకుళం, మహి న్యూస్, ఏప్రిల్ 15: జిల్లాలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లా కో-ఆర్డినేటర్ వై. యశోద లక్ష్మి వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రథమ సంవత్సరంలో 566 మంది విద్యార్థులకు గాను 496 మంది ఉత్తీర్ణులై 88 శాతం ఫలితాలను సాధించారు. ఇందులో ఎల్. గోవింద్ (బైపీసీ) 440/460, లింగాల రేష్మ, పొట్నూరు చరణ్ కుమార్ (ఎంపీసీ) 462/470, టి. దీపిక (సీఈసీ) 456/500 మార్కులు సాధించి తమ గ్రూపుల్లో జిల్లా టాపర్లుగా నిలిచి ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో 591 మందికి గాను 517 మంది పాసై 87 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, అల్లాడ సోనియా (బైపీసీ-977/1000), కొప్పిలి జగదీష్ (ఎంపీసీ-973/1000), కోనారి గీతా లక్ష్మి (సీఈసీ-850/1000) అత్యధిక మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ముఖ్యంగా దుప్పలవలస, పెద్దపాడు, కొల్లివలస, నందిగాం, తామరపల్లి గురుకులాలకు చెందిన విద్యార్థులు టాపర్లుగా నిలవడం విశేషం. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, వారికి మార్గనిర్దేశం చేసిన అధ్యాపక బృందాన్ని జిల్లా కో-ఆర్డినేటర్ అభినందించారు. ప్రభుత్వ గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతోందని ఈ ఫలితాలే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.

## ప్రణాళికా బద్ధంగా పట్టు మహాదేవి కోనేరు సుందరీకరణ పనులు

టెక్కలి, మహి న్యూస్, ఏప్రిల్ 15: పట్టణంలోని పట్టు మహాదేవి కోనేరు సుందరీకరణ పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం పర్యటనలో భాగంగా పట్టు మహాదేవి కోనేరులో జరుగుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, మంత్రి పరిశీలించారు. ప్రణాళిక ప్రకారం చేపడుతున్న పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధి పనుల వివరాలు, కోనేరు రక్షణ గోడ, రివిటింగ్ పనులు, వాకర్స్ ట్రాక్, ఆహ్లాదానికి, ఆకర్షణకు ఏర్పాటు చేయనున్న పచ్చదనం, వసతుల కల్పన పనులను మంత్రికి ఆర్డీఓ కృష్ణ మూర్తి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణానికి మణిహారం గా నిలిచేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రజలు , సందర్శకులకు ఆహ్లాదకరంగా, ఆకర్షణీయంగా కొత్త అనుభూతిని పొందే విధంగా ఉండనుందని అన్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించి అనుకున్న సమయంలోగా సుందరీకరణ పనులను పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. అంతకు ముందు పట్టుమహాదేవి కోనేరుపైనున్న శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామిని మంత్రి దర్శించుకున్నారు. స్వామి వారి సన్నిధిలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు వేదమంత్రాల మధ్య ఆశీస్సులు అందించారు. తీర్థ, ప్రసాదాలను అందజేశారు.

# గ్రామీణ వైద్యులు తమ పరిధిలో వైద్య సేవలు అందించాలి

## మధు గ్యాస్ట్రో హాస్పిటల్ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ మధుసూదన్.



నెల్లూరు ప్రతినిధి.: గ్రామీణ వైద్యులు గ్రామాలలో గ్రామీణ ప్రజలకు తమ పరిధిలో వైద్య సేవలు అందించాలని మధు గ్యాస్ట్రో హాస్పిటల్ సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ డి మధుసూదన్ రావు పేర్కొన్నారు. నెల్లూరు నగరంలోని స్థానిక టౌన్ హాల్లో గ్రామీణ వైద్యుల ఎనిమిదవ వార్షికోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ మధుసూదన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ వైద్యులు కొన్ని సందర్భాలలో తమ పరిధికి మించి వైద్య సేవలు అందించడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని చెప్పుటకు అనేక సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో గ్రామీణ వైద్యులు తమ పరిధిలో వైద్య సేవలు అందించి, అవసరమైతే సీనియర్ డాక్టర్లకు కేసులను సిఫారసు చేయాల్సిందిగా సూచించారు. ఏది ఏమైనా గ్రామాలలో ప్రాథమిక చికిత్సలతో పాటు చిన్నపాటి వైద్య సేవలు అందించడంలో గ్రామీణ వైద్య సేవలు అభినందనీయమన్నారు. గ్రామీణ వైద్యుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న నారాయణ కాలేజీలో నిర్వహించనున్న గ్రామీణ వైద్యుల జేఏసీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎం.మహేష్ మాట్లాడుతూ అసోసియేషన్ సంక్షేమానికి గ్రామీణ వైద్యులకు సూచనలు సలహాలు ఇవ్వడంలో నెల్లూరు జిల్లా కేంద్రంలోని పలువురు వైద్యులు అందిస్తున్న సేవలు అభినందనీయం అన్నారు. జిల్లా కేంద్రంగా నిర్వహించిన అసోసియేషన్ 8వ వార్షికోత్సవ కార్యక్రమానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి సుమారు 450 మందికి పైగా గ్రామీణ వైద్యులు పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఇందులో ముఖ్యంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు జిఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కంబాల బాబురావు, ఉభయ రాష్ట్రాల కోశాధికారి, రాష్ట్ర బీసీ వెల్ఫేర్ డైరెక్టర్ డాక్టర్ చ వెంకటేశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోషి మరియు ఎం సుధాకర్, ఉపేంద్ర రెడ్డి, రుద్రయ్య, సౌభాగ్య లక్ష్మి తదితరులు పాల్గొనడం జరిగిందని వారందరికీ ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి 90 రోజుల కార్యాచరణ ప్రణాళిక..!



తిరుపతి, మహి న్యూస్, ఏప్రిల్ 15 : రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి 90రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై తిరుపతి స్పోర్ట్స్ స్టేడియంలో జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 3,132 కి.మీల మేర యువగళం పాదయాత్ర చేపట్టినపుడు యువత ఆశలు, ఆకాంక్షలు తెలిశాయన్నారు. రాయలసీమను స్పోర్ట్స్ హబ్ గా చేస్తానని ఇచ్చిన హామీ త్వరలో కార్యరూపం దాల్చుతుందన్నారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ఏం చేయాలనే విషయమై గతంలో భారత మహిళా క్రికెట్ జట్టుతో సమావేశమై వారి అభిప్రాయాలు తెలుసుకున్నానని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద 421మందికి పైగా ఉద్యోగాలు సాధించారని తెలిపారు. స్పోర్ట్స్ కోటా నుంచి వచ్చిన ఉపాధ్యాయుల ప్రతిభను క్రీడారంగ అభివృద్ధికి ఉపయోగించుకుంటామన్నారు. చంద్రబాబు గారి హయాంలోనే హైదరాబాద్ లో స్పోర్ట్స్ విలేజ్ ఏర్పాటైందన్నారు. ఇక్కడ నుంచే జాతీయ, అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు వచ్చారని తెలిపారు. 90రోజుల యాక్షన్ ప్లాన్ లో రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి వరల్డ్ క్లాస్ బెస్ట్ మెకానిజం తయారుచేద్దామని పిలుపునిచ్చారు. అట్టడుగు స్థాయి నుంచి క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళు తున్నామని తెలియజేశారు. తిరుపతిలో అత్యుత్తమ మౌలిక సదుపాయాలతో శాప్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన క్రికెట్ మైదానం చాలా బాగుందని, దీని నిర్వహణకు కార్పొరేట్ కంపెనీల సహకారం తీసుకుంటామని తెలిపారు. ఎన్నో సమస్యలు ఎదుర్కొని తమ ప్రతిభతో రాణిస్తోన్న జ్యోతి యర్రాజీ, శ్రీచరణి వంటి మహిళా క్రీడాకారిణులకు చేయూత నందిస్తామని తెలిపారు.

### ఫిట్నెస్ మెరుగుపరిచే చర్యలు చేపడతాం

రాష్ట్రంలోని బాలలకు ఫిట్ నెస్ లేకపోవడం క్రీడల్లో వెనుకబాటుకు ప్రధాన కారణంగా గుర్తించామన్నారు. దీనిని అధిగమించేందుకు ప్రభుత్వ చర్యలతోపాటు తల్లిదండ్రుల సహకారం అవసరం అన్నారు. వ్యక్తిగతంగా కాకుండా వ్యవస్థీకృతంగా క్రీడాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. విశాఖ, విజయవాడ, తిరుపతి గ్రోత్ కారిడార్ల పరిధిలో క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారుచేస్తున్నామని వెల్లడించారు. క్రీడాకారులకు ఉద్యోగాల భర్తీలో న్యాయం జరిగేలా పారదర్శకత పాటిస్తున్నామన్నారు. క్రీడాకారులు అభిప్రాయాలన్నింటినీ డాక్యుమెంటేషన్ చేసి, 90రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధంచేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ భేటీలో అంతర్జాతీయ మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీరాజ్, షట్లర్ పివి సింధు, అర్జున అవార్డు గ్రహీత కరణం మల్లీశ్వరి, అథ్లెట్ యర్రాజీ జ్యోతి, బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్ నమ్మాళ్వార్, ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి (బ్లైండ్ క్రికెట్), పంగి కరుణ కుమారి (బ్లైండ్ క్రికెట్), ముసునూరి రోహిత్ లలిత్ బాబు (చెస్), షేక్ అర్షద్ (పారా సైక్లింగ్), కిల్లాక లలిత (పారా అథ్లెటిక్స్), తమిరి సూర్య చరిష్మ (బ్యాడ్మింటన్), తిరుమూరి గణేష్ మణిరత్నం (ఆర్చరీ), దండు పూజ (బ్యాడ్మింటన్), పి.శివారెడ్డి (ఖోఖో), ఇ. రజని (హాకీ), నవ్య కండేరి (బ్యాడ్మింటన్), కె.ద్వారకనాథ్ రెడ్డి (బాస్కెట్ బాల్), శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు.

# ప్రజాఆరోగ్య సంక్షోభ దిశగా మానసిక ఆరోగ్యం

## పౌర సమాజం విస్మరిస్తున్న నిశబ్ద సంక్షోభం

### సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి , మనో బంధు ప్రాంతీయ సమన్వయకర్త

కడప మహీన్యూస్ ఏప్రిల్ 15: మానసిక ఆరోగ్యం ప్రజా ఆరోగ్యంలో అంతర్భాగం; ఇది మానసిక అనారోగ్యం లేకపోవడం కంటే ఎక్కువ. వ్యక్తి శ్రేయస్సు ప్రభావవంతమైన పనితీరుకు పునాది. ఇందులో మానసిక శ్రేయస్సు, మానసిక రుగ్మతలు నివారణ, చికిత్స , పునరావాసం మానసిక ఆరోగ్యంలో భాగమే. భారతదేశంలో మానసిక ఆరోగ్య సమస్యల భారం 10000 జనాభాకు 2443 వైకల్యం-సర్దుబాటు జీవిత సంవత్సరాలు అని ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా వేసింది; 100000 జనాభాకు వయస్సు-సర్దుబాటు ఆత్మహత్య రేటు 21:1. 2012-2030 మధ్య మానసిక ఆరోగ్య పరిస్థితుల వల్ల కలిగే ఆర్థిక నష్టం 1.03 ట్రిలియన్ డాలర్లు అని అంచనా వేయబడింది. మానసిక ఆరోగ్య విధానం, 2014 నాణ్యమైన సేవా నిబంధనల కోసం భాగస్వామ్య హక్కుల ఆధారిత విధానాన్ని సమర్థిస్తుంది. మానసిక ఆరోగ్య సంరక్షణ చట్టం, 2017 మానసిక అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తుల హక్కులను రక్షించడానికి, ప్రోత్సహించడానికి అలాగే నెరవేర్చడానికి సేవలను అందించడానికి చట్టపరమైన చట్రాన్ని అందిస్తుంది. ఇది ఐక్యరాజ్యసమితి వికలాంగుల హక్కుల సమావేశం కి అనుగుణంగా ఉంటాయి. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమం ఉద్దేశం మానసిక ఆరోగ్య, వెల్ నెస్ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలో నాణ్యమైన సంరక్షణ అందించడం. డి అడిక్షన్ కేంద్రాలు, పునరావాస సేవలు కూడా అందుబాటులో ఉన్నాయి. మానసిక ఆరోగ్యాన్ని నిర్ణయించే వాటిలో ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన మరియు ఇతరులతో పరస్పర చర్యలు నిర్వహించే సామర్థ్యం వంటి వ్యక్తిగత లక్షణాలు ఉంటాయి. అదనంగా, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ మరియు పర్యావరణ కారకాలు నిర్దిష్ట మానసిక, వ్యక్తిత్వం, జన్యుపరమైన కారకాల వలె పాత్ర పోషిస్తాయి. మానసిక ఆరోగ్యానికి మద్దతుగా అవగాహన పెంచడం, ప్రయత్నాలను సమీకరించడం పరిస్థితిని పరిష్కరించడానికి అవసరం. మానసిక ఆరోగ్య ప్రచారంలో ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రోత్సహించి, ప్రజలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించే వాతావరణాన్ని సృష్టించడం ఉంటుంది. జాతీయ మానసిక ఆరోగ్య విధానాలు చట్టపరమైన చట్రాల ద్వారా వాతావరణాన్ని కల్పించడం మానసిక ఆరోగ్య రుగ్మతల ప్రభావవంతమైన నిర్వహణకు, మానసిక ఆరోగ్య ప్రమోషన్‌ను నిర్ధారించడానికి విస్తృత దిశలను అందించడానికి అత్యవసరం. దీనికి బహుళ రంగాల తోడ్పాటుతో పాటు జాతీయ విధానం అవసరం. మానసిక ఆరోగ్య రుగ్మతల చికిత్సకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ఇది మొత్తం ప్రభుత్వ విధానం ద్వారా ప్రమోషన్, నివారణ, చికిత్స, కోలుకోవడానికి సమగ్ర వ్యూహాలను కోరుతుంది. ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ స్థాయిలో సాధారణ మానసిక రుగ్మతలకు ఖర్చుతో కూడుకున్న చికిత్స లభ్యత, ప్రాప్యతను ప్రోత్సహించడానికి విధాన రూపకర్తలను ప్రోత్సహించాలి. మానసిక ఆరోగ్యం అనేది చాలా కాలంగా పౌర సమాజం విస్మరిస్తున్న నిశ్శబ్ద సంక్షోభం. వర్క్‌ప్లేస్ సర్వేలో మెంటల్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కోషెంట్ అనేది ఉండాలి.



ప్రపంచవ్యాప్తంగా మానసిక అనారోగ్యాలు సర్వసాధారణం. మానసిక అనారోగ్యాలలో తేలికపాటి నుండి మితమైన మరియు తీవ్రమైన వరకు తీవ్రతలో తేడా ఉన్న అనేక విభిన్న పరిస్థితులు ఉన్నాయి. ఈ పరిస్థితులను వివరించడానికి రెండు విస్తృత వర్గాలను ఉపయోగించవచ్చు: ఏదైనా మానసిక అనారోగ్యం మరియు తీవ్రమైన మానసిక అనారోగ్యం. 2023 నేషనల్ మెంటల్ హెల్త్ సర్వేలో 42% కార్పొరేట్ భారతదేశంలో నిరాశ లేదా ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్నారని గణాంకాలు తెలుపుతున్నాయి. డిప్రెషన్‌తో బాధపడుతున్న ముగ్గురిలో ఇద్దరు ఇప్పటికీ పనిలో లేదా కొత్త ఉద్యోగాల కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పది మందిలో ఒకరికి మాత్రమే ఎంప్లాయి అసిస్టెన్స్ ప్రోగ్రామ్ యాక్సెస్ ఉంది. భారతదేశంలో కేవలం వెయ్యికి పైగా నమోదిత కార్పొరేట్ సంస్థలు నిర్మాణాత్మక ఎంప్లాయీస్ అసిస్టెన్స్ ప్రోగ్రాంను కలిగి ఉన్నాయి. శ్రామిక శక్తిలో దాదాపు సగం మంది మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని సర్వే ఫలితాలు తెలుపుతున్నాయి, పురుషుల కంటే స్త్రీలు ఎక్కువ ప్రమాదంలో ఉన్నారు. ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని శాస్త్రీయ పద్ధతిలో అర్థం చేసుకోవాలి, కార్యాలయంలో మానసిక ఆరోగ్యానికి కారణమయ్యే అంశాలు గుర్తించాలి, ఉద్యోగుల కోసం పరివర్తన విధానాలు కేంద్రీకృత మానసిక-ఆరోగ్య కార్యక్రమాలను ప్రోత్సహిస్తుంది. మంచి ఆరోగ్యం శ్రేయస్సు కోసం ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యం 3ని చేరుకోవడానికి సీఎస్ఆర్ నిధులు, వనరుల దృక్పథాన్ని పునర్నిర్వచించడంలో సహాయపడుతుంది. మరీ ముఖ్యంగా, మానసిక-ఆరోగ్య పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయడానికి వినూత్న పబ్లిక్, ప్రైవేట్ కమ్యూనిటీ-ఆధారిత భాగస్వామ్యం సృష్టికి ఇది మార్గదర్శకంగా పనిచేస్తుంది.



నిమ్ హన్స్ 2022- 23 సర్వే ప్రకారం, దాదాపు 18% భారతీయ పెద్దలు ఏదో ఒక రకమైన మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇది దేశంలోనే 210 మిలియన్ల కంటే ఎక్కువ మంది బాధపడుతున్నారు, కొద్దిమందికి మాత్రమే అవసరమైన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మానసిక వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. భారతదేశంలోని 80% పైగా ప్రభుత్వ ఆసుపత్రులకు మానసిక వైద్యులు లేరు. చాలా మంది భారతీయ మానసిక వైద్యులు మెరుగైన అవకాశాల కోసం విదేశాలకు వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు 150 కోట్ల జనాభా ఉన్న దేశంలో కేవలం 9,000 కంటే తక్కువ మంది మానసిక వైద్యులు ఉన్నారు. . మానసిక అనారోగ్యం భారతదేశంలో ఎక్కువగా నిషిద్ధ అంశంగా కొనసాగుతోంది. ఈ సంవత్సరం చివరి నాటికి భారతదేశంలో సుమారు 20 శాతం మంది మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారని అంచనా వేస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య లెక్కలు చూస్తే 56 మిలియన్ల భారతీయులు నిరాశతో బాధపడుతున్నారు, 38 మిలియన్ల మంది భారతీయులు ఆందోళన రుగ్మతలతో బాధపడుతున్నారు. ప్రపంచంలోని అన్ని దేశాలలో ఆరోగ్యం, సామాజిక, మానవ హక్కులు, ఆర్థిక పరిణామాలపై గణనీయమైన ప్రభావాలతో మానసిక రుగ్మతల భారం పెరుగుతూనే ఉంది. నిరాశ, నిస్పృహ, బాధ, ఆనందం కోల్పోవడం, ఆత్మ విశ్వాసం కోల్పోవడం, నిద్ర లేమి, ఆకలి, అలసట, ఏకాగ్రత లేక పోవడం వంటివి ఈ మానసిక రుగ్మతలు కారణాలు. వీటి ప్రభావంతో మనుషులు ఆత్మహత్య చేసుకుంటారు . మానసిక రుగ్మతలు: నిరాశ (డిప్రెషన్), బైపోలార్ డిజార్డర్, మనోవైకల్యం( స్కిజోఫ్రెనియా) , సైకోసెస్, చిత్తవైకల్యం, ఆటిజం. నిరాశ, నిస్పృహ, మానసిక రుగ్మతలకు ఆరోగ్య పరంగా, సామాజికంగా బయట పడటానికి ప్రజలకు అవకాశం ఉన్నది. మానసిక ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక 2020-2023 ప్రజలందరికీ ఆరోగ్యాన్ని సాధించడంలో పూర్తిగా విఫలమైంది మానసిక ఆరోగ్యానికి మరింత సమర్థవంతమైన నాయకత్వం పాలన,సమాజ-ఆధారిత అమరికలలో సమగ్ర, అందరికి మానసిక ఆరోగ్యం, సామాజిక సంరక్షణ సేవలను అందించడం, అమలు , నివారణ కోసం వ్యూహాలు అమలు,సమాచార వ్యవస్థ, పరిశోధనలను బలోపేతం చేయలేక విఫలమయ్యింది.

# విద్యను వ్యాపారం చేసిన కూటమి,వైకాపా నాయకులు

## అధోగతి పాలవుతున్న రెవెన్యూ పనితీరు.

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కిరణ్ కుమార్ రెడ్డి.

నెల్లూరు.ప్రభ న్యూస్ ప్రతినిధి.: కూటమి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యను వ్యాపారం చేస్తున్నారని, నెల్లూరు జిల్లాలో రెవెన్యూ అధికారుల తీరు బాగాలేదని మరుపూరు గ్రామంలో 8 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుంటే కాకాణి నోరు ఎందుకు మెదపడం లేదని నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.నెల్లూరు నగరంలోని ఇందిరా భవన్ లో నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నారపరెడ్డి కిరణ్ కుమార్ రెడ్డి సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, ప్రైవేట్ స్కూళ్లకు అడ్మిషన్లు పెరిగాయి న్నారు.జిల్లాలో ఇంటర్నేషనల్ స్కూళ్లలో ఇంటర్ చదివి వారిని ఉపాధ్యాయులుగా పెట్టుకొని లక్షల రూపాయలు దండుకుంటున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యను వ్యాపారంగా చేసేశారన్నారు. నెల్లూరు నగరంలో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు విద్యతో వ్యాపారం చేస్తున్నాయని, పేద మధ్యతరగతి కుటుంబాలు నాశనమవుతున్నా పట్టించుకోవడంలేదన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణకు కమిటీలు లేవన్నారు. నామమాత్రపు జీతాలతో అర్హత లేని ఉపాధ్యాయులను పెట్టి పిల్లల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్నారన్నారు. ఫీజులు మాత్రం లక్షల్లో వసూలు చేస్తున్నారన్నారు.ప్రభుత్వ పాఠశాలల కనీస వసతుల కోసం ప్రైవేట్ పాఠశాలల ఫీజు దోపిడీపై కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుందన్నారు.




కనీస ప్రమాణాలు పాటించకుండా లక్షల్లో ఫీజులు దండుకుంటున్న ప్రైవేట్ స్కూల్ లపై చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ని కాంగ్రెస్ పార్టీ తరఫున కోరుతున్నామన్నారు.మరుపూరు గ్రామపంచాయతీ పరిధిలో ఇస్కాన్ సిటీ2 పేరుతో రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారు.వెంచర్ యాజమాన్యం పశువులు మేత మేసే నీటికుంట, డొంకను సైతం ఆక్రమించుకున్నారన్నారు. గ్రామస్తులు జిల్లా కలెక్టర్.కి అర్జీలు ఇచ్చినా, పత్రికల్లో కథనాలు వచ్చినా స్పందన కరువైందన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో చీమ చిట్టుక్కుమన్నా స్పందించే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి సొంత నియోజకవర్గం, సొంత మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు లు 8 ఎకరాల స్థలాన్ని తమ సొంత ఆస్తిలా ఆక్రమించుకుంటుంటే ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు కుమ్మక్కై గ్రామస్తులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఎవరి అండ చూసుకొని ప్రభుత్వ భూమిలో అంత దర్జాగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. పొదలకూరు మండల రెవెన్యూ అధికారి అధికార పార్టీని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మేనేజ్ చేస్తున్నాడా! అంటే చేయగలనని అధికారే మాట్లాడుతుండటం చూస్తుంటే జిల్లాలో అవినీతి ఏ విధంగా జరుగుతుందో ప్రజలు గమనించాలన్నారు. ప్రభుత్వ భూమిని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెడుతుంటే ఉపేక్షించే పరిస్థితి ఉండదన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామస్తులతో కలిసి లోకాయుక్తకు వెళ్తుందని, విడిచి పెట్టే ప్రసక్తే ఉండదని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడ అవినీతి జరిగినా, ఎవ్వరికీ అన్యాయం జరిగినా జిల్లా కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చి పోరాటం చేస్తుందని, అండగా నిలుస్తుందని తెలియజేస్తున్నామన్నారు. ప్రజలకు సేవ చేయాలనుకునే యువకులకు, ఉత్సాహవంతులకు ఇందిరా భవన్ గేట్లు ఎప్పుడు తెరిచే ఉంటాయని తెలియజేస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులుడాక్టర్ యశోదర, సర్వేపల్లి కోఆర్డినేటర్ హరి ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, సిటీ అధ్యక్షుడు ఇర్ఫాన్, లీగల్ సెల్ కన్వీనర్ సుధీర్, బుచ్చి కిషోర్, సేవాదళ్ సుజాత, హనీఫ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

RNI : APTEL/25/A0108
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com

# నవోదయంలో ప్రీ వెడ్డింగ్ షూట్ వివాదం

## చర్యలు తీసుకోవాలని డిమాండ్




యానాం, మహి న్యూస్, ఏప్రిల్ 15.: స్థానిక మెట్టకూరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రీ వెడ్డింగ్ షూట్ నిర్వహించిన ఘటన యానాంలో వివాదాస్పదంగా మారింది. ఈ విద్యాలయంలో చదివిన ఇద్దరు పూర్వ విద్యార్థులు అనుమతులు లేకుండా విద్యాలయ ఆవరణలో ప్రీ వెడ్డింగ్ వీడియో షూటింగ్ నిర్వహించడం చర్చనీయమైంది. వివరాల ప్రకారం, పూర్వ విద్యార్థులైన ఈ ఇద్దరు వ్యక్తులు తరగతి గదులు, ప్రిన్సిపాల్ గది, కళాశాల ప్రాంగణం తదితర ప్రదేశాల్లో వీడియో చిత్రీకరణ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో షూటింగ్ నిర్వహించినట్లు తెలిసింది. దీంతో విద్యాలయ నియమ నిబంధనలు ఉల్లంఘించబడ్డాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని సుంకర స్వామినాయుడు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకర కార్తిక్ యానాం పరిపాలనాధికారి శివరాజ్ మీనాకు ఫిర్యాదు చేశారు. విద్యాసంస్థల గౌరవం దెబ్బతినే విధంగా ఇలాంటి చర్యలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, షూటింగ్‌లో పాల్గొన్న ఇద్దరు పూర్వ విద్యార్థుల్లో ఒకరు పుదుచ్చేరిలో అసిస్టెంట్‌గా, మరొకరు తిరుపతిలోని నవోదయ విద్యాలయంలో లెక్చరర్‌గా పనిచేస్తున్నట్లు సమాచారం. విద్యావేత్తలుగా ఉన్న వారు ఈ విధంగా వ్యవహరించడం బాధ్యతారాహిత్యమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై స్పందించిన విద్యాలయ ప్రిన్సిపాల్ కీర్తి, ఆ ఇద్దరు పూర్వ విద్యార్థులు ముందుగా వచ్చి తమ వివాహ శుభలేఖ ఇచ్చారని తెలిపారు. అయితే ప్రీ వెడ్డింగ్ షూటింగ్‌కు ఎలాంటి అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. ఫోటోలు మాత్రమే తీసుకోవాలని చెప్పారని, కానీ వారు విస్తృతంగా వీడియో షూటింగ్ నిర్వహించారని తెలిపారు. ఈ ఫిర్యాదుపై విచారణ జరిపిస్తామని యానాం పరిపాలనాధికారి శివరాజ్ మీడియాకు తెలిపారు. సంబంధిత ఘటనపై పూర్తి వివరాలు సేకరించి, అవసరమైతే బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఈ సంఘటన విద్యాసంస్థల్లో నియమాల అమలు, పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

# కదిరిలో పేలుడు సంఘటన లో నలుగురు మరణించడం, 24 మంది గాయపడ్డారు బాధాకరం

కదిరి, మహి న్యూస్, ఏప్రిల్ 15 : శ్రీ సత్యసాయి జిల్లాలో కదిరి పట్టణం కుమ్మరవాండ్లపల్లిలో జరిగిన పేలుడు ప్రమాదంలో నలుగురు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు అత్యంత విషాదకర ఘటన అని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. పెద్ద రాళ్లను పేల్చేందుకు ఉపయోగించే జిలెటిన్ స్టిక్స్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించినట్లుఅనుమానిస్తున్నామని మీడియాతో అన్నారు. కూలీలు నివసిస్తున్న ఇంట్లో ఈ పేలుడు చోటుచేసుకోవడంతో తీవ్ర నష్టం జరిగిందని, పేలుడు ప్రభావంతో ఇంటి పైకప్పు కూలిపోగా, సమీపంలోని మూడు ఇళ్లు పూర్తిగా నేలమట్టం అయ్యాయని తెలిపారు ఈ ఘటనపై సమాచారం అందుకున్న వెంటనే బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి ప్రమాద స్థలాన్ని సందర్శించి, అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ ఘటనపై వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ గారితో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు తగిన సహాయం అందించాలని కోరగా, మంత్రి వెంటనే స్పందించారని, సంబంధిత అధికారులు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు . ఈ సంఘటన అత్యంత దురదృష్టకరమని పేర్కొంటూ, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ ఈ ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నది తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన అసెంబ్లీ ఇంచార్జ్ భైరెప్రసాద్, తెలుగు దేశం పార్టీ నాయకురాలు పర్వీన్ బాను గారు, బీజేపీ నాయకులు నాగార్జున, డీఎల్ అంజనేయులు, నంది సెట్టిబాబు, మైనార్టీ మోర్చా నాయకులు ఇంతియాజ్ , ప్రతాప్, చలపతి తదితరులు పాల్గొన్నారు.

# సింహాచలనాథుని నిత్య అన్నదాన పథకానికి రూ. 2 లక్షల విరాళం



సింహాచలం, మహి న్యూస్, ఏప్రిల్ 15: ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి వారి నిత్య అన్నప్రసాద పథకానికి బుధవారం భారీ విరాళం అందింది. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ ప్రత్యేక ఆహ్వానితులు గంట్ల శ్రీనుబాబు స్వామివారిపై ఉన్న భక్తిశ్రద్ధలతో రూ. 2 లక్షల చెక్కును విరాళంగా అందజేశారు. గంట్ల శ్రీనుబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించి, విరాళానికి సంబంధించిన చెక్కును ఆలయ ఆలయ ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె. తిరుమలేశ్వరరావు, మరియు పర్యవేక్షకులు కె. వెంకటేశ్వరరావు లకు చెక్కును అందజేశారు. ఈ మొత్తాన్ని భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలకు వినియోగించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి సింహాద్రి నాథుడిని దర్శించుకుని అనంతరం ఆలయ వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ.. “సింహాద్రి అప్పన్న అత్యంత మహిమాన్వితులని, అటువంటి స్వామివారు కొలువై ఉన్న సింహాచలం లో జన్మించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. స్వామివారి సేవలో భాగంగా అన్నదాన పథకానికి నా వంతు సహాయం అందించడం చాలా సంతోషంగా ఉంది” అని తెలిపారు.

# జలధారతోనే భూగర్భ జలాల పునరుజ్జీవం

## సీఎస్ సమీక్షలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

టెక్కలి, మహి న్యూస్, ఏప్రిల్ 15: జిల్లాలో భూగర్భ జల మట్టాలను పెంచి, నీటి ఎద్దడిని నివారించడమే ధ్యేయంగా ‘జలధార’ కార్యక్రమం కింద చేపట్టవలసిన పనులకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర సచివాలయం నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయిప్రసాద్, సీసీఎల్ఏ జి. జయలక్ష్మి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన టెక్కలి నుండి పాల్గొన్నారు. జలధార పనులు, 22ఏ కేసుల పరిష్కారం, పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ అంశాలపై ఈ సందర్భంగా లోతుగా చర్చించారు. సీఎస్ సాయిప్రసాద్ మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లాలో విజయవంతమైన ‘జలధార’ స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా ‘నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత’ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. మే, జూన్ నెలల్లో పంపిణీ చేయవలసిన పట్టాదారు పాస్ పుస్తకాలలో మార్పులను పక్కాగా నమోదు చేసి, రాజముద్రతో కూడిన పుస్తకాలను నిర్ణీత సమయంలోగా నూరు శాతం పంపిణీ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందిస్తూ.. జిల్లాలో పాస్ పుస్తకాల ముద్రణకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నామని, దరఖాస్తులను నిశితంగా పరిశీలించి నిబంధనల మేరకు పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తామని వివరించారు.

# భారత ప్రజాస్వామ్యాన్ని పరిహసించే డీలిమిటేషన్ ప్రక్రియ

### డా.ముచ్చుకోట .సురేష్ బాబు



సికింద్రాబాద్ మహీన్యూస్ ఏప్రిల్ 15: భారతదేశ ఎన్నికల చరిత్రలో ఒక కీలక మార్పు దశను చేరుకుంటున్న ఈ సమయంలో, డిలిమిటేషన్, విస్తృత రాజకీయ ప్రాతినిధ్యం అనే రెండు ప్రతిపాదనలు ఆశలతో పాటు ఆందోళనలను కూడా రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా మహిళల రిజర్వేషన్ వంటి చర్యల ద్వారా ప్రాతినిధ్యాన్ని విస్తరించడం ప్రజాస్వామ్య పురోగతికి సంకేతం అయినప్పటికీ, ఈ సంస్కరణలను అమలు చేసే విధానం పారదర్శకత, సంప్రదింపులు సమాఖ్య సమతుల్యతపై తీవ్రమైన సందేహాలను కలిగిస్తోంది.మహిళల రిజర్వేషన్ డిలిమిటేషన్ బిల్లులను పూర్తిగా రహస్యంగా, సంప్రదింపులు లేకుండా తీసుకురావడం ఆందోళనకర విషయం. ఈ చట్టాలు భారత ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని మౌలికంగా పునర్నిర్మించనున్నాయి. మహిళల రిజర్వేషన్‌ను రాజకీయ ఉద్దేశ్యాలతో కూడిన డిలిమిటేషన్‌ను అమలు చేయడానికి ఒక ఆవరణంగా ఉపయోగిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పౌర ప్రజా సంఘాల సభ్యుల విస్తృత వర్గం మద్దతుతో వెలువడిన ఒక తాజా ప్రజా ప్రకటనలో, డిలిమిటేషన్ ఎన్నికల పునర్వ్యవస్థీకరణకు సంబంధించిన కీలక చట్టాలను ప్రవేశపెట్టడంలో పారదర్శకత లేకపోవడం, సంప్రదింపులు జరపకపోవడం వంటి అంశాలను ప్రస్తావించింది. ప్రజలకు అందుబాటులో ముసాయిదా బిల్లులు లేకపోవడం, సంబంధిత వర్గాలతో అర్థవంతమైన చర్చలు జరగకపోవడం, భారతదేశ ప్రీ-లెజిస్లేటివ్ కన్సల్టేషన్ విధానానికి విరుద్ధంగా ఉంది. ఇది కేవలం ప్రక్రియలో లోపం మాత్రమే కాదు; భాగస్వామ్య ప్రజాస్వామ్యన్ని దెబ్బతీసే అంశం.డిలిమిటేషన్ స్వభావం పరంగా సాధారణ పరిపాలనా ప్రక్రియ కాదు. ఇది ఒక రాజ్యాంగ వ్యవస్థ, ఇది లోక్‌సభలో స్థానాల కేటాయింపును నిర్ణయిస్తుంది, తద్వారా కోట్లాది ప్రజల రాజకీయ స్వరాన్ని ప్రభావితం చేస్తుంది. దశాబ్దాలుగా ఈ ప్రక్రియను నిలిపివేయడం వెనుక జనాభా నియంత్రణలో ముందంజలో ఉన్న రాష్ట్రాలను అన్యాయానికి గురి కాకుండా చూడాలనే ఉద్దేశం ఉంది. 2026 తర్వాత ఈ నిలుపుదల ముగియనుండగా, ప్రాతినిధ్య పునర్విభజన అనివార్యం. అయితే, ఈ మార్పును ఎలా అమలు చేస్తారనేది భారత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తుందా లేక బలహీనపరుస్తుందా అనేది నిర్ణయిస్తుంది.ఈ సమస్యకు మూల కారణం భారతదేశంలోని జనాభా అసమానత. దక్షిణ రాష్ట్రాలు జనాభా నియంత్రణలో విజయాన్ని సాధించగా, ఉత్తర రాష్ట్రాలు అధిక జనాభా వృద్ధిని చూశాయి. జనాభా ఆధారంగా మాత్రమే స్థానాలు కేటాయిస్తే, దక్షిణ రాష్ట్రాలు ప్రాతినిధ్యాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది, ఉత్తర రాష్ట్రాలు రాజకీయంగా మరింత బలపడతాయి. ఈ మార్పు కేవలం గణాంక పరిమితిలోనే కాదు; సమాఖ్యలో అధికార సమతుల్యతపై దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతుంది.ఇలాంటి కీలక నిర్ణయాలను ప్రజా పర్యవేక్షణ లేకుండా తీసుకోవడం ప్రజాస్వామ్య సంస్థలపై నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. సంప్రదింపులు కేవలం పరిపాలనా ప్రక్రియ కాదు; అది ప్రజాస్వామ్యానికి అవసరమైన మూల సూత్రం. ప్రీ-లెజిస్లేటివ్ కన్సల్టేషన్ విధానం ప్రకారం ముసాయిదా చట్టాలను ప్రజల ముందుకు తీసుకువచ్చి అభిప్రాయాలను సేకరించాలి. ఈ ప్రక్రియను పక్కన పెట్టడం ద్వారా సంస్కరణల నైతిక చెల్లుబాటు తగ్గుతుంది. ప్రస్తుత పరిస్థితిలో మరో విరుద్ధత కూడా కనిపిస్తోంది. ఒకవైపు మహిళల రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచే లక్ష్యంతో సంస్కరణలు తీసుకువస్తున్నారు. మరోవైపు, ఆ సంస్కరణల రూపకల్పనలో మహిళలతో సహా ప్రజల భాగస్వామ్యాన్ని నిరాకరిస్తున్నారు. ఇది సంస్కరణల నైతికతను బలహీనపరుస్తుంది. డిలిమిటేషన్ చర్చ సమాఖ్య సమానత్వంపై కూడా ప్రభావం చూపుతుంది. లోక్‌సభలో ప్రాతినిధ్యం కేవలం జనాభాను ప్రతిబింబించడమే కాదు; అది రాజకీయ ప్రభావం, వనరుల పంపిణీ, విధానాల దిశను కూడా నిర్ణయిస్తుంది. ఒక ప్రాంతానికి అధిక ప్రాధాన్యం లభించి, మరొక ప్రాంతం వెనుకబడితే సమాఖ్య సమతుల్యత దెబ్బతింటుంది.అయితే, జనాభా మార్పులకు అనుగుణంగా ప్రాతినిధ్యాన్ని నవీకరించడం అవసరం అనే వాస్తవాన్ని ఎవరూ ఖండించలేరు. ప్రజాస్వామ్యం అభివృద్ధి చెందాలి, సంస్థలు మార్పులకు అనుగుణంగా మారాలి. కానీ ఆ మార్పు అమలు విధానం కూడా బలంగా, పారదర్శకంగా ఉండాలి. మొత్తం లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచడం ద్వారా పెద్ద రాష్ట్రాలకు ప్రాతినిధ్యం పెంచుతూ, ఇతర రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించకుండా చూడవచ్చు. అలాగే రాజ్యసభను బలోపేతం చేయడం ద్వారా అన్ని రాష్ట్రాల స్వరాన్ని రక్షించవచ్చు.చివరగా, ప్రశ్న డిలిమిటేషన్ జరగాలా లేదా అనేది కాదు; అది ఎలా జరగాలి అనేదే ముఖ్యమైనది. పారదర్శకత, భాగస్వామ్యం, వివేచనాత్మక చర్చలతో కూడిన ప్రక్రియ ఒక విభేదాస్పద అంశాన్ని ప్రజాస్వామ్య పునరుద్ధరణకు అవకాశంగా మార్చగలదు. కానీ తొందరపాటు, రహస్య విధానం ప్రాంతీయ ఆందోళనలను మరింత పెంచి ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది.భారత ప్రజాస్వామ్యం తన బలం సంభాషణలోనే ఉందని ఎప్పుడూ నిరూపించింది. ఈ కీలక సంస్కరణలను అమలు చేసే సమయంలో, ఫలితాల న్యాయసమ్మతత కంటే ప్రక్రియ యొక్క పారదర్శకత ముఖ్యమని గుర్తుంచుకోవాలి. డిలిమిటేషన్‌ను ముందుచూపుతో, న్యాయబద్ధంగా అమలు చేస్తే అది ఐక్యతను బలోపేతం చేస్తుంది; లేకపోతే అది భారత సమాఖ్య ప్రజాస్వామ్యంలో విభేదాలకు దారితీసే పాయింట్‌గా మారే ప్రమాదం ఉంది.

# ముదురుపోతున్న పెళ్లి కొడుకులు

## - పెళ్లికాని ప్రసాద్ లు ఆందోళన లో తల్లిదండ్రులు



ముమ్మిడివరం (మహి న్యూస్ ) ఏప్రిల్ 15: అమ్మాయికి అన్ని పనులూ వచ్చా.. అనే ప్రశ్న బదులు.. అబ్బాయి ఉద్యోగం ఏంటి అనే క్వశ్చన్ బాగా వినిపిస్తోంది. అమ్మాయి అణుకువ ఉంటుందా .. అని ఆరా తీయడం బదులు.. అబ్బాయి బుద్ధిమంతుడా కాదా అన్న ఎంక్వైరీలు మొదలయ్యాయి. కట్నం ఎంత ఇస్తారు.. అన్న మాట కంటే . కట్నం ఇవ్వకపోయినా పర్లేదు అన్న అభిప్రాయాలు ఎక్కువయ్యాయి.ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పురుష పుంగవులకు వివాహ రేఖలు కనిపించడం లేదు. 30 దాటినా పెళ్లి కాని వారి మగవారి సంఖ్య రానురాను పెరుగుతోంది. ఈ జిల్లాల్లో పెళ్లి కాని ప్రసాదులు పెరుగుతున్నారు. ఇదివరకు అబ్బాయి ఓకే అంటే అమ్మాయి తరఫు వారు హమ్మయ్య అంటూ గెంతులు వేసే వారు. కానీ ఇప్పుడు ఓకే చెప్పే అధికారం పూర్తిగా అమ్మాయి తరఫు వారికే మళ్లిపోయినట్టు ఉంది. ఫలితంగా వయసు ముదురుతున్నా పెళ్లి కాక ఎంతో మంది యువకులు మిగిలిపోతున్నారు. ఒకప్పటిలా తల్లిదండ్రులు చూపించిన వరుడితో తలవంచుకుని తాళి కట్టించుకునే అమ్మాయిలు ఇప్పుడు తక్కువైపోయారు. అబ్బాయిలు రాజీ పడుతున్నా అమ్మాయిలు నో అంటున్నారు.

### పెరిగిన అడ్డుగోడలు:

ప్రస్తుతం ట్రెండ్ పూర్తిగా మారిపోయింది. పెళ్లి చేసుకోబోయే అబ్బాయి ఫలానా విధంగా ఉండాలని అమ్మాయిలు చాలా ఎక్కువ అంచనాలు పెట్టుకుంటున్నారు. సంపాదన ఒక్కటే చూడకుండా ప్రొఫెషన్‌ను కూడా గమనిస్తున్నారు. తక్కువ సంపాదన ఉన్న ప్రైవేటు ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్న వాళ్లకి తక్కువగా ప్రాధాన్యం ఇస్తున్నారు. పెద్ద స్థాయిలో జీతాలు ఉండి ఒత్తిడిని ఎదుర్కొనే ఉద్యోగాల సంబంధాలను కూడా వదిలేసుకోవడానికి వెనుకాడడం లేదు. ప్రస్తుతం అమ్మాయిలు కూడా ఉద్యోగాలు చేస్తుండడంతో ఉన్నత ఉద్యోగులకు అందునా ప్రభుత్వ ఉద్యోగులకు ఎప్పటిలాగానే డిమాండ్ ఉంది.

### పెళ్లికి అమ్మాయిల అనుమతి

రోజులు మారాయి. అమ్మాయి కుటుంబం బాగుంటే చాలు. ఆస్తిపాస్తులు ఇవ్వనవసరం లేదంటున్నారు. అమ్మాయికి నేను నచ్చానో లేదో ఒకసారి అడగండి అని అబ్బాయిలే అంటున్నారు. అవసరమైతే కట్నం లేకుండా చేసుకుంటామంటున్నారు. గతంలో వైద్య వృత్తి, ఫార్మసీ, డెంటల్, అగ్రికల్చర్ ఇంజినీరింగ్, బిఎస్సీ అగ్రికల్చరల్, ఎంబీఏ, ఎంసీఏ, సీఏ, ఇంజినీరింగ్ వంటి కోర్సులను చదివే వారి సంఖ్య తక్కువగా ఉండేది. ఈ అర్హతలు చెబితే చాలు ఇట్టే పెళ్లయిపోయేది. కానీ ఇప్పుడా పప్పులు ఉడకడం లేదు.

### పెరిగిన వివాహం వయసు:

ఒకప్పుడు అమ్మాయికి పెళ్లీడు రాగానే పెళ్లి చేసే వారు. ఇప్పుడు 25 ఏళ్ల వరకు వివాహ ప్రస్తావన ఎత్తడం లేదు. చదువుకున్న కుటుంబాల్లో ఇది ఎక్కువగా ఉంది. ఒకప్పుడు అబ్బాయిలు కూడా 20 ఏళ్లకు పెళ్లి చేసుకునే వారు. కానీ వారు కూడా 30 ఏళ్లు దాకా పెళ్లి మాట ఎత్తడం లేదు. ఆ తర్వాత అమ్మాయిలు దొరకడం కష్టమవుతోంది. గ్రామాల్లో కొన్ని కుటుంబాల్లో మాత్రమే సరైన వయసులో వివాహాలు జరుగుతున్నాయి. పట్టణాలు, చదువుకున్న కుటుంబాలలో మాత్రం అధిక శాతం వివాహాలు ఆలస్యంగా జరుగుతున్నట్లు మ్యారేజ్ బ్యూరో నిర్వాహకులు చెపుతున్నారు.

### అబ్బాయ్ లను ఎంచుకునే అవకాశం : అంతా 30 ఏళ్లు పైబడినవారే

జాతకాల కోసం ముహూర్తాల కోసం వచ్చేవారు అధికంగా 30ఏళ్లు పైబడినవారే. చాలా మంది తల్లిదండ్రులు వారి అబ్బాయిలకు తగిన అమ్మాయిలు దొరకడం లేదని బాధ వ్యక్తం చేస్తున్నారు. అబ్బాయిలను ఎంచుకునే అవకాశం అమ్మాయిలకు లభిస్తుండడం గమనిస్తున్నాం.

### విళ్ల ఈశ్వరరావు సిద్ధాంతి

### ఆలోచనలో మార్పు : యువత ఆలోచనలో మార్పు

యువత ఆలోచన ధోరణిలో వచ్చిన మార్పే ఒక కారణమైతే, అమ్మాయిలు తక్కువగా ఉండడం మరో కారణం. పెళ్లి కోసం అమ్మాయిలను వెతుక్కోవడానికే సరిపోతుంది. కే. గోపాల్ కృష్ణ శర్మ, పురోహితులు

# మత్స్యకారుల కడుపు నింపింది కూటమి ప్రభుత్వం... మోసం చేసింది జగన్ ప్రభుత్వం




అమరావతి, మహి న్యూస్, ఏప్రిల్ 15: మత్స్యకారుల సంక్షేమం, వారి కుటుంబాల భద్రత కోసం నిజంగా పని చేసింది కూటమి ప్రభుత్వమేనని రాష్ట్ర వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో మత్స్యకారులను మాటలతో మభ్యపెట్టి వారి హక్కులను కాలరాసింది జగన్ ప్రభుత్వం అని ఆయన తీవ్రంగా మండిపడ్డారు. మత్స్యకారుల జీవనోపాధిని బలోపేతం చేయడంలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. బుధవారం జువ్వలదిన్నె హార్బర్ వద్ద నిస్సుగ్గుగా జగన్ పచ్చి అబద్దాలు తెలిపారని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి గత ప్రభుత్వంలో కేంద్రం వాటా అయిన 128 కోట్లను ఉపయోగించకుండా నిధులను పక్కదారి పట్టించారని, రాష్ట్ర వాటా కూడా మత్స్యకారుల కోసం ఉపయోగించకుండా ఇష్టానుసారంగా వ్యవహరించారని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కేంద్రం వాటా నిధులను వెంటనే కట్టాలని కేంద్రం రాష్ట్రానికి లేఖ రాసిందని, లేకపోతే ఇతర సబ్సిడీలు అమలు చేసేది లేదంటూ చెప్పటంతో వెంటనే రాష్ట్ర ప్రభుత్వం 128 కోట్ల బకాయిలను విడుదల చేసామని తెలిపారు.నేడు జగన్ నోటికి వచ్చిన అబద్ధాలు మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. వేట నిషేధ కాలంలో ఇచ్చే భృతిని రూ.10,000 నుండి రూ.20,000కు పెంచి, లక్షలాది కుటుంబాలకు నేరుగా ఆర్థిక భరోసా కల్పించామని చెప్పారు. ఒకే సంవత్సరంలో భారీగా రూ.242 కోట్లకు పైగా సహాయం అందించడం కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. మత్స్యకారుల ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు డీజిల్ సబ్సిడీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, వేలాది పడవలకు లీటరుకు రూ.9 సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో ఇచ్చిన సబ్సిడీ కంటే మెరుగైన సహాయం తాము అందిస్తున్నామని పేర్కొన్నారు. నిస్సుగ్గుగా మత్స్యకారుల ప్రమాద మరణ పరిహారాన్ని 10 లక్షలకు పెంచామని చెప్తున్న జగన్, గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెండింగ్‌లో ఉన్న మత్స్యకారుల మరణ పరిహారాలైన 2024-25లో రూ.3.15 కోట్లు చెల్లించామని, అదే విధంగా 2025-26లో రూ.5.65 కోట్లు చెల్లించామని తెలిపారు. నీ ఇష్టానుసారంగా నీ పత్రిక, నీ మనుషులు చెప్పిన మాటలను చదవటం కాకుండా నిజాలను తెలుసుకుని ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత నీకు లేదా అంటూ మండిపడ్డారు. మత్స్యకారుల కుటుంబాలకు న్యాయం చేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. సామాజిక భద్రతా పింఛనును రూ.3,000 నుండి రూ.4,000కు పెంచి, వేలాది మంది మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించామని అన్నారు. ఈ పథకం ద్వారా ఇప్పటికే భారీ మొత్తంలో నిధులు విడుదల చేశామని తెలిపారు. మత్స్యకారుల భద్రత కోసం ట్రాన్స్పాండర్లు అమర్చడం, కృత్రిమ రీఫ్‌ల ఏర్పాటు, చేప పిల్లల విడుదల, డీప్ సీ ఫిషింగ్ పడవల పంపిణీ వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మంత్రి వివరించారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధి, ఫిషింగ్ హార్బర్లు, ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణం ద్వారా మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని చెప్పారు. జగన్ ప్రభుత్వం కేంద్ర నిధులను పక్కదారి పట్టించి మత్స్యకారులను మోసం చేసిందని ఆరోపించిన మంత్రి, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ.128 కోట్ల కేంద్రం వాటా బకాయిలను కేంద్రానికి చెల్లించి పారదర్శకతను నిరూపించామని తెలిపారు. నిజాలు దాచిపెట్టి అబద్ధాలు ప్రచారం చేయడం జగన్‌కు అలవాటైపోయిందని విమర్శించిన మంత్రి అచ్చెన్నాయుడు, మత్స్యకారుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మత్స్యకారుల డిమాండ్ల మేరకు 2015-16లో 8 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించామని, దీనికి సంబంధించిన ఖూ=లను ఔూ్రూజుూూ ద్వారా సిద్ధం చేయించామని మంత్రి వివరించారు. ఫేజ్-1లో జువ్వలదిన్నె, ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. ఫేజ్-2లో బుడగట్లపాలెం, పుడిమడక, కొత్తపట్నం, వొడరేవు హార్బర్లు ప్రతిపాదించబడ్డాయని చెప్పారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిధులతో ఆమోదించగా, ప్రస్తుతం అది పూర్తి దశకు చేరుకుందని తెలిపారు. ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం, వొడరేవు హార్బర్లు 2019-20లో ఆమోదించబడినప్పటికీ, అప్పటి ప్రభుత్వం ఖీ×ణఖీ రుణాన్ని సక్రమంగా వినియోగించకపోవడంతో పనులు మందగించాయని విమర్శించారు. ప్రస్తుతం ఉప్పాడ, మచిలీపట్నం, నిజాంపట్నం హార్బర్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. తదుపరి కేంద్ర ప్రభుత్వం ూవీవీూ పథకం కింద బుడగట్లపాలెం, పుడిమడక, కొత్తపట్నం హార్బర్లను ఆమోదించిందని చెప్పారు. రాష్ట్రంలో మొత్తం రూ.3,328.48 కోట్లతో 10 ఫిషింగ్ హార్బర్ల అభివృద్ధి జరుగుతోందని మంత్రి తెలిపారు. వీటిలో కొన్ని పూర్తి దశకు చేరుకోగా, మరికొన్ని నిర్మాణంలో వేగంగా కొనసాగుతున్నాయని వివరించారు. ఇక 2018-19లో మంచినీలపేట, బియ్యపుటిప్ప ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల అభివృద్ధి ప్రారంభించినప్పటికీ, 2019 నుంచి 2024 వరకు నిధుల విడుదలలో జరిగిన ఆలస్యం కారణంగా అవి పూర్తికాలేదని చెప్పారు. అలాగే 2021-22, 2022-23లో ూవీవీూ కింద భీమిలి, రాజయ్యపేట, చింతపల్లి, రాయదరువు, దొండవాక, ఉప్పలంక ప్రాంతాల్లో రూ.126.91 కోట్లతో 6 ఫిష్ ల్యాండింగ్ సెంటర్లకు ఆమోదం లభించినప్పటికీ, గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు ప్రారంభం కాలేదని మండిపడ్డారు. మత్స్యకారుల అభివృద్ధిపై మాట్లాడే నైతిక హక్కు జగన్ కు లేదని మంత్రి అచ్చెన్నాయుడు తీవ్రంగా విమర్శించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## తిరుచానూరు అమ్మవారిని దర్శించుకున్న ఢిల్లీ ముఖ్యమంత్రి



తిరుచానూరు, మహి న్యూస్, ఏప్రిల్ 15: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా బుధవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు అధికారులు ఘనస్వాగతం పలికారు. ఆలయం వద్ద ఢిల్లీ ముఖ్యమంత్రికి ఆలయ డిప్యూటీ ఈఓ హరీంద్రనాథ్, వీజీవో గిరిధర్, ఏవీఎస్ఓ రాధాకృష్ణమూర్తి, ఏఈఓ దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్ మరియు ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు ముందుగ ధ్వజస్తంభానికి మొక్కులు తీర్చుకున్న ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, అనంతరం శ్రీ పద్మావతి అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేద ఆశీర్వచన మండపంలో రిత్వికులు ఆమెకు వేద ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలను మరియు శేష వస్త్రాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రికి అందజేశారు.

## అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుంది

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 15: జిల్లాలో అర్హులైన వారందరికీ అక్రిడేషన్ కార్డుల మంజూరు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధ్యక్షతన డీఎంఏసీ కమిటీ మూడవ సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో కన్వీనర్, ఎన్ వేలాయుధం, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనల మేరకు, అర్హత కలిగిన ప్రతి ఒక్క ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. దశలవారీగా డీఎంఏసీ కమిటీ సమావేశాలు నిర్వహించి అక్రిడేషన్ కార్డులు మీడియా ప్రతినిధులకు అందజేయడం జరుగుతుంది. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 302 మంది మీడియా ప్రతినిధులకు అక్రిడేషన్ కార్డులు పంపిణీ చేయడం జరిగింది. ఈరోజు ప్రింట్ 56మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు,19 మందికి 4 మాస పత్రికలకు మొత్తం 79 మీడియా ప్రతినిధులకు ఈరోజు కమిటీలో ఆమోదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ మెంబర్లు, ఎస్ గంగాధర్, జి రమేష్ బాబు, ఏ బాలాజీ, లక్ష్మీపతి, హరి ప్రసాద్, పి రాజేంద్ర నాయుడు, పి చంద్ర ప్రకాష్, జగదీష్, వై కాళేశ్వర్ రెడ్డి, డీఎంహెచ్ఓ నాగ శశి భూషణ్ రెడ్డి, ఆర్టిసి పర్సనల్ ఆఫీసర్ షహజ్ తదితరులు పాల్గొన్నారు.

## మండలాల ఎంపీడీవోలు ప్రతిరోజు ఫీల్డ్ అసిస్టెంట్లతో గ్రామాల అభివృద్ధి పనులపై సమీక్షించాలి

### జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



చిత్తూరు, మహి న్యూస్, ఏప్రిల్ 15: మండలాల ఎంపీడీవోలు ప్రతిరోజు ఫీల్డ్ అసిస్టెంట్లతో గ్రామాల అభివృద్ధి పనులపై సమీక్షించాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో ఎంపీడీవోలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం సమయంలో కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వేతనం కోసం పనిచేయాలనుకునే గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల కార్మికులను సమీకరించి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం మరియు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం లక్ష్యంగా "వేతనార్థుల సమీకరణ" కార్యక్రమాన్ని సమీక్షించారు ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్లు గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించాలని పేర్కొన్నారుప్రభుత్వ ఉపాధి పథకాలపై, హక్కులపై మరియు లభించే ప్రయోజనాలపై కార్మికులకు అవగాహన కల్పించాలిఉపాధి కల్పన ద్వారాగుర్తించిన వేతనార్థులకు తగిన ఉపాధి అవకాశాలను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు గ్రామాలలోఅమలు జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించి, సమస్యలను పరిష్కరించాలి ఎంపీడీవోలను, ఏపీఓ లను ఆదేశించారు.జలధార-జలహారతి కార్యక్రమం క్రింద జల వనరులను పెంపొందించి, నీటి భద్రతను బలోపేతం చేసే పనులను గ్రామ, మండల స్థాయిలో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారుప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న నీటి వనరులు, వాటి ప్రస్తుత వినియోగం, వాటిని మరింత ప్రయోజనదాయకంగా మలచేందుకు అవసరమైన పనులు గుర్తించి సత్వరం ప్రతిపాదించాలని అధికారులకు సూచించారు. నీటి స్ట్రక్చర్ల సూయిజ్ లు, షట్టర్లు ల రిపేర్లు, బండ్ ల పటిష్టీకరణ, కొండవాగులపై చెక్ డామ్ ల ఏర్పాటుకు అవకాశాలు, చెరువుల గొలుసు కట్టు వ్యవస్థల పునరుద్ధరణ, హ్యాండ్ పంపులు, బోరుబావుల రిచార్జింగ్, వినియోగంలో లేని పశు త్రాగునీటి తొట్టెలను శుభ్రపరచి వాడకంలోకి తేవడం వంటి పనులు గుర్తించి యాప్ లో నమోదు చేయాలన్నారు. కార్వేటి నగరం, ఐరాల, పలమనేర్, వీకోట, రొంపిచర్ల, పులిచెర్ల, మండలాల ఎంపీడీవోలతో సమీక్షించారు, పై కార్యక్రమంలో రెండు వారం లోపల పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ లను ఆదేశించారు, ఈ కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించిన ఫీల్డ్ అసిస్టెంట్ శాఖ పరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని హెచ్చరించారు, రేపటి రోజు సాయంత్రం సమయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించడం జరుగుతుందని తెలిపారు.

## చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు క్రీడా వికాస కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్

చంద్రగిరి, మహి న్యూస్, ఏప్రిల్ 15 : తిరుపతి జిల్లా చంద్రగిరిలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన నారా రామ్మూర్తినాయుడు క్రీడా వికాస కేంద్రాన్ని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ముందు క్రీడా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు హాకీ క్రీడాకారుల ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం నారా రామ్మూర్తినాయుడు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియాన్ని మంత్రి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ తో కలిసి బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. చిన్నారులతో టేబుల్ టెన్నీస్, హాకీ ఆడారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. సీఎం చంద్రబాబు నాయుడు గారి సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు జ్ఞాపకార్థం ఆయన పేరిట రూ.3.17 కోట్లు వెచ్చించి ఈ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. జాతీయస్థాయిలో క్రీడలు నిర్వహించుకునేందుకు వీలుగా ఈ కేంద్రాన్ని నిర్మించారు. సీఎం చంద్రబాబు గారు విద్యాభ్యాసం చేసిన పాఠశాలలో క్రీడా వికాస కేంద్రాన్ని 2017లో మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో పనులు నిలిచిపోవడంతో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేక చొరవ తీసుకుని క్రీడా వికాస కేంద్రాన్ని తీర్చిదిద్దారు. మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, క్యారమ్స్, టేబుల్ టెన్నీస్, స్కిప్పింగ్, చెస్, జిమ్, యోగా వంటి క్రీడా సదుపాయాలు, అవుట్ డోర్ లో వాలీబాల్, కబడ్డీ, కోకో, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు హాకీ క్రీడా మైదానాన్ని అందుబాటులోకి తీసుకుతెచ్చారు. ఈ క్రీడా వికాస కేంద్రం చంద్రగిరి పరిసర ప్రాంతాల క్రీడాకారులకు శిక్షణ, అభివృద్ధికి వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణ, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శ్రీపతి బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, దండు పూజ, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఆర్వో ప్లాంట్ ప్రారంభం




తిరుపతి,మహి న్యూస్, ఏప్రిల్ 15 : ప్రణీత్ ఫౌండేషన్ సామాజిక బాధ్యతలో భాగంగా ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను మంత్రి లోకేష్ ఘనంగా ప్రారంభించారు. ఎడిఫై విద్యాసంస్థల అధినేత, ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రణీత్ సుమారు రూ. 5 లక్షల వ్యయంతో 160 లీటర్ల సామర్థ్యం గల ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు.

### సేవా కార్యక్రమాలకు అభినందనలు

క్రీడాకారుల సౌకర్యార్థం ప్రణీత్ ఫౌండేషన్ ముందుకు రావడం అభినందనీయమని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ప్రణీత్ నేతృత్వంలో ఇలాంటి మరిన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ ప్లాంట్ ద్వారా స్పోర్ట్స్ కాంప్లెక్స్ సిబ్బందికి, అథ్లెట్లకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి వచ్చింది.

# చంద్రగిరి ప్రగతికి నూతన జవజీవాలు.. అంతర్జాతీయ స్థాయి వసతులతో క్రీడా మైదానం ప్రారంభం

చంద్రగిరి,మహి న్యూస్, ఏప్రిల్ 15 :రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చంద్రగిరి నియోజకవర్గ పర్యటన అత్యంత వైభవంగా సాగింది. తొలుత పట్టణంలోని టవర్ క్లాక్ వద్దకు చేరుకున్న మంత్రికి కూటమి నాయకులు, కార్యకర్తలు బాణాసంచా కాలుస్తూ, గజమాలతో ఘనస్వాగతం పలికారు. పార్టీ జెండాల రెపరెపల మధ్య భారీ ఎత్తున తరలివచ్చిన జనసందోహం మంత్రికి



నీరాజనాలు పలికారు. అక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరినీ లోకేష్ ఆప్యాయంగా పలకరిస్తూ ఉత్సాహపరిచారు. అనంతరం ప్రభుత్వ బాలుర కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన ఎన్.ఆర్.ఎన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్దకు మంత్రి చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ వేడుకలో ఆయన రిబ్బన్ కత్తెరించి, ఈ ఆధునిక క్రీడా సముదాయాన్ని జాతికి అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ మంత్రి లోకేష్‌తో పాటు రాష్ట్ర రవాణా, యువజన , క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఆయన కుమారుడు పులివర్తి వినీల్ పాల్గొన్నారు. ఈ వేడుకకు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ దిగ్గజాలు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్టేడియంలోని కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ , ఆర్చరీ అకాడమీలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. క్రీడా ప్రాంగణం అంతా కలియతిరిగిన మంత్రి, అక్కడ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ స్థాయి వసతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రికి స్టేడియం విశేషాలను, క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలను వివరించారు. క్రీడాకారులలో ఉత్సాహం నింపేందుకు మంత్రి స్వయంగా హాకీ స్టిక్ పట్టి కొద్దిసేపు క్రీడను ఆస్వాదించారు. అనంతరం వివిధ క్రీడలకు చెందిన అథ్లెట్లతో మంత్రి ముచ్చటించి, వారితో కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. యువత క్రీడల్లో రాణించడానికి అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ






సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. చంద్రగిరి యువతకు అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించినందుకు ఎమ్మెల్యే పులివర్తి నానిపై మంత్రి లోకేష్ ప్రశంసలు కురిపించారు. రాష్ట్ర యువత క్రీడల్లో విశేష ప్రతిభ కనబరచడానికి అవసరమైన అన్ని వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో భాగంగా చంద్రగిరి పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల క్రీడా మైదానంలో అత్యాధునిక వసతులతో కూడిన ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వచ్చింది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఈ స్టేడియం పనులు ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వ నిర్లక్ష్యం మరియు నిధుల కొరత కారణంగా పనులు గోడల స్థాయిలోనే నిలిచిపోయాయి. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక చొరవ చూపి, సుమారు 3 కోట్ల 20 లక్షల నిధులను మంజూరు చేయించడంతో ఈ స్టేడియం పనులు వేగంగా పూర్తయ్యాయి. ఈ స్టేడియానికి దివంగత నారా రామ్మూర్తి నాయుడు జ్ఞాపకార్థం "ఎన్ఆర్ఎన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్" గా నామకరణం చేశారు. చంద్రగిరి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి వెన్నుదన్నుగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు మరియు నూతన అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను మంజూరు చేస్తూ సహకరిస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఆయన కృతజ్ఞతలు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నియోజకవర్గ రూపురేఖలు మారుతున్నాయని, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు రాబోయే రోజుల్లో చంద్రగిరిని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ మంత్రి లోకేష్‌తో పాటు రాష్ట్ర రవాణా, యువజన ,క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంచార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. ఈ వేడుకకు అంతర్జాతీయ బ్యాడ్మింటన్ దిగ్గజాలు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్ మరియు భారత హాకీ క్రీడాకారిణి రజని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరితో పాటు శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ శ్రీకాంత్, పులివర్తి వినీల్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఇతర ఎమ్మెల్యేలు , మండల అధికారులు ,కూటమి ప్రభుత్వ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## తిరుపతిలో ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను ప్రారంభించిన మంత్రి నారా లోకేష్..

తిరుపతి , మహి న్యూస్, ఏప్రిల్ 15 : తిరుపతిని స్పోర్ట్స్ హబ్ గా తీర్చిదిద్దుతామనే యువగళం హామీ కార్యరూపం దాలుస్తోంది. తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ఏడాదిలో రూ.35 కోట్లకు పైగా నిధులు కేటాయించడం జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం తిరుపతి పట్టణం గొల్లవానిగుంటలో నూతనంగా నిర్మించిన ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, అకాడమీలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. శాప్, తుడా సహకారంతో రూ.10.10 కోట్ల నిధులు వెచ్చించి ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను నిర్మించారు. ముందుగా క్రీడా ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ తో పాటు క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ అకాడమీలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. క్రీడా ప్రాంగణం మొత్తం కలియతిరిగారు. ఈ సందర్భంగా క్రికెట్, కబడ్డీ, కోకో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ క్రీడాకారులతో గ్రూప్ ఫోటో దిగారు. కొద్దిసేపు వాలీబాల్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. అనంతరం ఎన్టీఆర్ క్రికెట్ స్టేడియంతో పాటు ఎన్టీఆర్ క్రికెట్ పెవిలియన్ ను ప్రారంభించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాల్ రాజ్, ఇతర క్రీడాకారులతో కలిసి కొద్దిసేపు క్రికెడ్ ఆడారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులతో సంభాషించి వారిని ఉత్సాహపరిచారు. క్రీడా ప్రాంగణంలో ప్రణీత్ ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను మంత్రి






ప్రారంభించారు. ఎన్టీఆర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ను క్రికెట్ మైదానం, ఖోఖో, కబడ్డీ, ఖఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఆర్చరీ కోర్టులతో పాటు పలు క్రీడా సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. ఈ సముదాయం క్రీడా సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు ఈ ప్రాంత భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించనుంది. అంతకుముందు తిరుపతిలోని శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో రూ.5.35 కోట్ల వ్యయంతో కరణం మల్లీశ్వరి వెయిట్ లిఫ్టింగ్ అకాడమీ, 200 మంది క్రీడాకారులకు వసతి సదుపాయం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన జూనియర్ బాక్సింగ్ రింక్ ను ప్రారంభించారు. గూడూరు నియోజకవర్గం కోటలో రూ.2.31 కోట్ల వ్యయంతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రం, సూళ్లూరుపేటలో రూ.2.70 కోట్ల వ్యయంతో క్రీడా వికాస కేంద్రం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. రేణిగుంట ఏపీఎస్టీఆర్ఈఐఎస్ స్కూల్ లో రూ.80 లక్షల వ్యయంతో ఎన్టీఆర్ క్రీడా వికాస కేంద్రానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణ, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ జోనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకులు డాక్టర్ శ్రీపతి బాబు, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, సూర్య చరిష్మ తమిరి, దండు పూజ, నవ్య కందేరి, భారత అంధ క్రికెటర్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి, అంధ మహిళా క్రికెటర్ పంగి కరుణ కుమారి, పారా అథ్లెట్ రవి రంగలి, పారా సైక్లిస్ట్ షేక్ అర్షద్, పారా అథ్లెట్ కె.లలిత, ఆర్చరీ ప్లేయర్ టి.గణేష్ మణిరత్నం, భారత హాకీ క్రీడాకారిణి రజని తదితరులు పాల్గొన్నారు.

## మొగిలీశ్వర ఆలయ అర్చకులు ఎటువంటి అన్యాయాలకు పాల్పడలేదు.

### అర్చకులపై తప్పుడు ఫిర్యాదు చేసిన మొగిలి మంజునాథ్ నాయుడు పై వెంటనే చర్యలు తీసుకోవాలి.

### పత్రిక మీడియా సమావేశంలో మొగిలి గ్రామస్తులు.

చిత్తూరు జిల్లా /బంగారుపాళ్యం ఏప్రిల్ 15: చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం బంగారుపాలెం మండలం మొగిలి గ్రామంలో వెలసిన శ్రీ కామాక్షి సమేత మొగిలీశ్వర స్వామి ఆలయ అర్చకులపై ఎండోమెంట్ అధికారులకు తప్పుడు ఫిర్యాదు చేసిన మొగిలి మంజునాథ నాయుడు పై వెంటనే చర్యలు తీసుకోవాలని







పత్రిక ముఖంగా బుధవారం తెలిపారు.ఆలయ అర్చకులు భక్తుల నుండి గుడి లోపల చేసే పూజలతో అధిక వసూళ్లు చేస్తున్నారని మంజునాథ్ తప్పుడు ఫిర్యాదు చేశారని, గత ఎన్నో సంవత్సరాలుగా మొగిలి ఆలయాన్ని నమ్ముకుని పనిచేస్తున్న అర్చకులపై ఫిర్యాదు చేయడం సబబు కాదని మొగిలి ఆలయ భక్తుల నుండి కూడా ఇంతవరకు ఎటువంటి ఫిర్యాదులు ఆలయ ఈఓకు గాని, ఆలయ ధర్మకర్తకు కానీ అందలేదని మొగిలి ఆలయం ఎదుగుదలను చూసి ఓర్వలేని మంజునాథ్ నాయుడు ఇటువంటి ఆరోపణలు చేయడం పట్ల భగవంతుడు అతన్ని వదిలిపెట్టే ప్రసక్తే ఉండదని గ్రామస్తులు తెలిపారు. ఆలయానికి రావలసినటువంటి పంచాయతీ నిధులు కూడా 2014వ సంవత్సరంలో తన తల్లి పంచాయతీ సర్పంచ్ గా ఉన్న సమయంలో ఆలయ అభివృద్ధికి సహకరించకుండా తిరిగి ప్రభుత్వానికి అప్పచెప్పినట్లు, ఇటువంటి వారి వలన గుడికి చెడ్డ పేరు తప్ప ఏ ఒక్క మంచి పని చేయని వీరిని భగవంతుడు క్షమించాడని గ్రామస్తులు తెలిపారు. తప్పుడు ఫిర్యాదులు తప్పుడు సంతకాలు చేయించిన మంజునాథ పట్ల ఈ దినం సమావేశానికి తప్పుడు సంతకాలు చేసిన 9 మంది రాకపోవడం శోచనీయంగా ఉందని వారు తెలిపారు. తప్పుడు ఫిర్యాదు చేసిన మంజునాథ్, ఇకపై అర్చకులు ఆలయంలో పూజలు నిర్వహించరాదని ఆలయ అధికారులకు తెలపడంతో, భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని తప్పుడు ఫిర్యాదును ఎటువంటి పరిస్థితుల్లో పట్టించుకోరాదని, వాస్తవాలను ఈరోజు తేల్చలేకపోయారని యధావిధిగా ఆలయ అర్చకులు పూజలు నిర్వహించాలని అందుకు మా అంగీకారం ఎప్పటికీ ఉంటుందని మొగిలి గ్రామస్తులు తెలిపారు. మొగిలి దేవరకొండ, మొగిలి కామాక్షి సమేత మొగలిరేశ్వర స్వామి ఆలయానికి భక్తులతో మరింత అభివృద్ధికి మా వంతు ఎప్పటికీ కృషి చేస్తామని, మా పూర్వీకుల నుండి కూడా ఆలయ అభివృద్ధికి పాటుపడినట్లు మా వంతు మేము ఇకపై ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని మొగిలి గ్రామస్తులు పేర్కొన్నారు.కార్యకమంలో హేమచంద్ర నాయుడు (బాబ్జి ) తులసిరామ్ నాయుడు, పెద్ద బాబు నాయుడు, సుబ్రమణ్యం నాయుడు, ప్రసాద్ నాయుడు, ఆనంద నాయుడు, దుర్గాపతి నాయుడు, గోపి ప్రసాద్ రెడ్డి, ధనుంజయ నాయుడు, జగదీష్ నాయుడు, మొగిలి గ్రామస్తులు ఏకమై అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# గురు, శుక్రవారాల్లో జలధార జలహారతి గ్రామసభలను నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 15: గురు, శుక్రవారాల్లో జలధార - జలహారతి గ్రామసభలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు. బుధవారం రాత్రి జల ధార - జలహారతి గ్రామసభల నిర్వహణపై కలెక్టర్ ఎంపీడీవోలు, ఇరిగేషన్ ఇంజనీర్లు, డ్వామా ఏపీవోలు తదితరులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జలధార జల హారతి కార్యక్రమంలో భాగంగా చెరువుల పునరుద్ధరణ, ఫీడర్ చానల్స్, చెరువుల అనుసంధానం తదితర నీటి సంరక్షణ పనులను చేపట్టాలని ఆదేశించారు. ఇందులో భాగంగా 100 రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసేందుకు గ్రామాల వారీగా పనులను గుర్తించడం జరిగిందన్నారు. ఈ పనులను గ్రామ సభల్లో చర్చించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఎంపీడీవోలు ఇరిగేషన్, డ్వామా, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. టెలి కాన్ఫరెన్స్ లో డ్వామా పీడీ నర్సింహారెడ్డి, జలవనరుల శాఖ ఎస్ ఈ బాలచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించండి

కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 15:- పిజిఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ. సిరి రిజిస్ట్రేషన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో రిజిస్ట్రేషన్ శాఖ అధికారులతో పీజీఆర్ఎస్, రెవెన్యూ జనరేషన్, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిరోజూ ఉదయం పిజిఆర్ఎస్ లాగిన్ లో వచ్చిన అర్జీలను చూడాలని క రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రతి అర్జీ పై వెంటనే స్పందించి నాణ్యత కలిగిన పరిష్కారం చూపించి ప్రజలలో విశ్వాసాన్ని పెంచాలన్నారు. రిజిస్ట్రేషన్ శాఖ ద్వారా ప్రజలకు పారదర్శకంగా మెరుగైన సేవలు అందించి ప్రజల నుండి సానుకూల స్పందన శాతాన్ని పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ శాఖ ద్...

# జలధార-జలహారతి కార్యక్రమంలో భౌగోళిక సాంకేతికతల వినియోగం



నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 15:- రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో అమలవుతున్న జలాధార - జలహారతి 100 రోజుల కార్యక్రమంలో భాగంగా, వ్యవసాయం, తాగునీటి సరఫరా మరియు భూగర్భ జలాల పునరుద్ధరణ లక్ష్యంగా భౌగోళిక సాంకేతికతలను సమర్థవంతంగా వినియోగించనున్నట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో ఆంధ్రప్రదేశ్ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ , ఐటి - ఈసీ విభాగం ఆధ్వర్యంలో జిల్లాకు నియమితులైన శాస్త్రవేత్త కె. లక్ష్మీకాంత రెడ్డి జిల్లా, మండల స్థాయి జల వనరుల మ్యాపుల వివరాలను కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త జిల్లా కలెక్టర్‌తో సమావేశమై, జిల్లా మరియు మండల స్థాయిలో రూపొందించిన భౌగోళిక పటాలను సమర్పించారు. ఈ మ్యాపులలో వాగులు, కాలువలు, చెరువులు, నదులు, రిజర్వాయర్లు వంటి ఉపరితల జల వనరుల వివరాలతో పాటు జిల్లా, మండలాలు, గ్రామాలు, నివాస ప్రాంతాల పరిపాలనా సరిహద్దులు పొందుపరిచారు. అదనంగా రైల్వే మార్గాలు, రహదారి జాలం వంటి మౌలిక వసతుల వివరాలు కూడా చేర్చబడ్డాయి. ఈ పటాలు సాగునీటి శాఖకు గ్రామ స్థాయిలో ప్రణాళికలు రూపొందించడంలో, సమర్థవంతమైన నిర్ణయాలు తీసుకోవడంలో కీలకంగా ఉపయోగపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో నీటి భద్రతను మెరుగుపర్చడమే లక్ష్యంగా, అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# సచివాలయ సిబ్బంది ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి: జిల్లా కలెక్టర్



మహానంది/నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 15 :- రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలు గ్రామస్థులకు సమర్థవంతంగా చేరాలంటే సచివాలయ సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం మహానంది మండలం తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాలలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై కలెక్టర్ సమగ్రంగా ఆరా తీశారు. ముఖ్యంగా సిబ్బంది ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించి, విధులకు సమయానికి హాజరై బాధ్యతాయుతంగా సేవలు అందించాలని స్పష్టం చేశారు. హాజరు నమోదులో ఏవైనా లోపాలు, నిర్లక్ష్యం గమనించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు గ్రామస్తులతో మాట్లాడిన కలెక్టర్, సచివాలయ సిబ్బంది ప్రవర్తన, సేవల నాణ్యతపై ఫీడ్‌బ్యాక్ సేకరించారు. ప్రజల సమస్యలను సమయానికి పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెంచాలని సూచించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే వినతులను నిర్లక్ష్యం చేయకుండా, నిర్దిష్ట గడువులో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును బాధ్యతగా తీసుకుని పారదర్శకంగా పరిష్కరించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో పారిశుధ్య పరిస్థితులపై గ్రామస్తులు చేసిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని, వెంటనే అన్ని ప్రాంతాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను ఆదేశించారు. సచివాలయ వ్యవస్థ ప్రజలకు మరింత చేరువ కావాలంటే క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవా దృక్పథం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సులభంగా, సమయానికి అందేలా ప్రతి సిబ్బంది కృషి చేయాలని సూచించారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వేగం పెంచాలి: సీఎస్ ఆదేశాలు



నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 15 :- రెవెన్యూ సమస్యల పరిష్కారానికి వేగం పెంచాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశించారు. బుధవారం సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుండి సిఎస్ జి. సాయి ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో 22ఏ తొలగింపులు, రీసర్వే, రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్, 'ప్రాజెక్టు జలధార' వంటి కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. 22ఏ సంబంధితంగా సుమారు 150 దరఖాస్తులు అందాయని, వాటిలో 111 కేసులకు పట్టాల పంపిణీకి సిద్ధం చేసినట్లు చెప్పారు. మిగిలిన 39 కేసులను అసైన్డ్ మరియు పోరంబోకు భూములుగా గుర్తించినట్లు వెల్లడించారు. ఇప్పటికే పట్టాలు పొందిన లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని, మిగిలిన దరఖాస్తులను కూడా త్వరితగతిన పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జలధార--జలహారతి' కార్యక్రమం అమలులో భాగంగా జిల్లాలోని 25 మండలాల్లో 191 గ్రామాలలో ఉన్న 330 చెరువులను నింపేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేసినట్లు కలెక్టర్ తెలిపారు. చెరువుల కాస్కేడ్ వ్యవస్థపై దృష్టి సారించడం ద్వారా గ్రామాల్లో నీటి నిల్వలు పెరిగి సస్యశ్యామలంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రతి చెరువు ప్రారంభం, ముగింపు వివరాలను పూర్తిగా అవగాహన చేసుకోవాలని సూచించారు. చెరువుల్లో పెరిగిన మొక్కలు, పొదలను ఉపాధి హామీ పథకం ద్వారా తొలగించాలని, ఇందుకు అవసరమైన అనుమతులు ఇప్పటికే మంజూరు చేస్తున్నామని తెలిపారు. అంతకుముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ మాట్లాడుతూ, రెవెన్యూ అంశాలపై కూలంకషంగా దృష్టి సారించి, పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని ఆదేశించారు. 'జలధార--జలహారతి' కార్యక్రమానికి సంబంధించి బ్యాంక్ వారీగా నివేదికలు రూపొందించాలని సూచించారు. స్థానిక ప్రజలతో సంప్రదించి చెరువుల నీటి నింపుదల స్థితిని పూర్తిగా తెలుసుకోవాలని అన్నారు. అదేవిధంగా, రీడింగ్ చానెల్స్ పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని,వాగులు,వంకలనుమేజర్ ఇరిగేషన్‌కాలువలతోఅనుసంధానం చేసేచర్యలు చేపట్టాలని సూచించారు.

# పట్టాధార్ పాస్‌బుక్‌ల పంపిణీ మార్చి 2027 నాటికి పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 15:- రాష్ట్ర చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ నుండి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. బుధవారం సాయంకాలం చీఫ్ సెక్రటరీ సాయిప్రసాద్ అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి అధికారులతో మాట్లాడుతూ...22ఏ రికార్డు లు సరి చేయాలని , రెవెన్యూ రికార్డు ల డిజిటలైజషన్ లు త్వరగా చేయాలని , రీసర్వే పనులు అన్ని పూర్తి చేసుకుని మార్చి 2027 నాటికి అన్ని పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణి పూర్తి చేయాలని , గత కొన్ని నెలల నుండి పెండింగ్‌లో ఉన్న అన్ని మ్యుటేషన్‌లు మరియు సబ్-డివిజన్‌లను జూన్ 2026 నాటికి పూర్తి చేయాలి అని,పట్టా దార్ పాసుబుక్ ల పంపిణీ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి గారు రీ సర్వేను సమీక్షిస్తారు. ఎలాంటి తప్పులు లేని పాస్‌బుక్‌లు జారీ చేయాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు కావున ఎలాంటి తప్పులు ఉండరాదని పాస్‌బుక్‌ల విషయంలో ఏమాత్రం పొరపాట్లు జరిగినా, సంబంధిత అధికారులందరిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి అని కలెక్టర్ తెలిపారు . వర్షపు నీటిని నిలువ చేసుకునే అన్ని చర్యలు , చెరువుల లో ఉన్న పూడికలు , పంటకాలువల పూడికలు తీసే చర్యలు చేపట్టాలని అన్ని చెరువులు నీటితో నింపే చర్యలు తీసుకోవాలి అని వీటి ద్వారా భూగర్భ జలాలు పెరిగే చర్యలు చేపట్టాలని అని కలెక్టర్ ఆదేశించారు. ట్యాంక్ వైస్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి ఒక ట్యాంక్ నుంచి ఇంకో ట్యాంక్ కు నీరు చేరే లాగా అనుసంధానం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో గ్రామసభలు పెట్టి మాస్టర్ ట్రైనర్స్ ని గుర్తించాలి అన్నారు. గుర్తించిన వారిని అన్నమయ్య జిల్లాకు పంపించి అక్కడ వారికి ట్రైనింగ్ ఇప్పించి కర్నూలు జిల్లా లో ఆవిధంగా పనులు జరిగే లాగా చర్యలు తీసుకోమని అధికారులను ఆదేశించారు. ఒక గ్రామపంచాయతీలో ఎన్ని ట్యాంకులు ఉన్నాయి? ఆ ట్యాంకులకు సంబంధించి జరుగవలసిన మరమ్మత్తు పనులు గుర్తించి వాటిలో ఎన్ని అప్రూవ్ చేశారో ఆ ట్యాంకులకు ఇప్పుడు ఎస్టిమేట్ జెనరేట్ చేయాలి ఆదేశించారు . ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ఇన్చార్జ్ డిఆర్ఓ చిరంజీవి , జిల్లా పరిషత్ సీఈవో రమణారెడ్డి , డ్వామా పిడి నరసింహారెడ్డి , పంచాయతీ రాజ్ ఎస్ఈ ప్రభాకర్ రెడ్డి , డిజాస్టర్ మేనేజ్మెంట్ పి ఓ సురేష్ కుమార్ , పశుసంవర్ధక శాఖ జెడి హేమంత్ కుమార్ , ఎస్ డి సి నాగప్రసూన , డిపిఓ భాస్కర్ , గ్రౌండ్ వాటర్ డి. డి. సునీల్ కుమార్,తహసీల్దార్ లు వెంకటేశ్వర్లు , ప్రకాష్ బాబు మొదలగు వారు పాల్గొన్నారు.

# జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్ల ప్రారంభం ప్రజలకు రూ.5కే నాణ్యమైన భోజనం



కర్నూలు, మహి న్యూస్, ఏప్రిల్ 15: జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్ల ను ప్రారంభించడం జరిగిందని, ప్రజలకు రూ.5కే నాణ్యమైన భోజనం అందించడం ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి పేర్కొన్నారు. బుధవారం పాణ్యం నియోజకవర్గం కల్లూరు మండల పరిధిలోని నంద్యాల చెక్ పోస్ట్ సమీపంలో ప్రజా ఆరోగ్య, పురపాలక సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో రూ. 61.00 లక్షలతో నిర్మించిన నూతన అన్న క్యాంటీన్ ను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి, స్థానిక ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కలసి అన్న క్యాంటీన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజలకు భోజనం వడ్డించి, అన్న క్యాంటీన్ లో భోజనం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో పేద ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన ఆహారం అందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన అన్న క్యాంటీన్ లు విజయవంతంగా నడుస్తున్నాయన్నారు. ఈ రోజు జిల్లాలో మరో 4 అన్న క్యాంటీన్లు ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లాలో 11 అన్న క్యాంటీన్లు పనిచేస్తున్నాయన్నారు. అన్న క్యాంటీన్ ల ద్వారా ప్రజలకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఒక్కో భోజనానికి సుమారు రూ.34 లు, టిఫిన్‌కు రూ.22 లు ఖర్చు అవుతుండగా, ప్రభుత్వం ఈ ఖర్చును భరిస్తూ ప్రజలకు కేవలం రూ.5కే అందిస్తున్నదని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే పనిచేస్తున్న అన్న క్యాంటీన్లను స్వయంగా సందర్శించి, భోజన నాణ్యత, సేవలపై ప్రజల అభిప్రాయాలను సేకరించినట్లు కలెక్టర్ తెలిపారు. అందరూ సేవలపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ప్రస్తుత కాలంలో రూ.5కు టీ కూడా దొరకని పరిస్థితుల్లో అన్న క్యాంటీన్ల ద్వారా అన్నం, పప్పు, సాంబార్, పెరుగు, పచ్చడి వంటి ఐదు రకాల వంటకాలను అందించడం బాగుందని ప్రజలు స్పందిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణలో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ పరంగా కర్నూలు జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి అన్న క్యాంటీన్‌లో రోజుకు ఉదయం టిఫిన్‌కు 300 నుండి 400 మంది, మధ్యాహ్నం భోజనానికి 400 నుండి 500 మంది, రాత్రి భోజనానికి సుమారు 500 మంది వరకు ప్రజలు భోజనం చేస్తున్నారని వివరించారు. ఈ రోజు ప్రారంభించిన కొత్త 4 అన్న క్యాంటీన్ల ద్వారా మరింత మందికి ఉపయోగకరంగా ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.

**పేదల ఆకలి తీర్చడమే లక్ష్యం - పాణ్యం నియోజకవర్గంలో మూడో అన్న క్యాంటీన్ ప్రారంభం: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి**

పేదల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తోందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితా రెడ్డి తెలిపారు. పాణ్యం నియోజకవర్గంలో ఇప్పటికే రెండు అన్న క్యాంటీన్లు పనిచేస్తుండగా, తాజాగా ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్‌తో మొత్తం మూడు క్యాంటీన్లు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన రోజునే అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు తొలి సంతకం.చేశారని గుర్తుచేశారు. గత ప్రభుత్వం కాలంలో అన్న క్యాంటీన్లు మూసివేయబడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణతో పాటు విస్తరణకు ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. 2024 ఆగస్టు 15న తొలి దశలో 100 అన్న క్యాంటీన్లు, సెప్టెంబర్ 19న మరో 75 క్యాంటీన్లు ప్రారంభించగా, అనంతరం దశలవారీగా మొత్తం 204 క్యాంటీన్లు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాజాగా ప్రారంభించిన 62 క్యాంటీన్లతో కలిపి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 266 అన్న క్యాంటీన్లు ప్రజలకు సేవలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు సుమారు 2 లక్షల 10 వేల మంది అన్న క్యాంటీన్లలో భోజనం చేస్తున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు 8 కోట్ల 80 లక్షల మందికి భోజనం అందించినట్లు వివరించారు. ప్రతి క్యాంటీన్‌లో సగటున 500 మంది భోజనం చేస్తున్నారని తెలిపారు. నంద్యాల చెక్‌పోస్ట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ అన్న క్యాంటీన్ ఓర్వకల్లు, నందికొట్కూరు ప్రాంతాలకు కేంద్రంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామస్థాయికి అన్న క్యాంటీన్ సేవలను విస్తరించడం హర్షణీయమని, పేదల ఆకలి తీర్చే దిశగా ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే వెల్లడించారు. పాణ్యం నియోజకవర్గంలో అన్న క్యాంటీన్ల ఏర్పాటు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ ఎస్.ఈ రమణమూర్తి, మున్సిపల్ ప్రజా ఆరోగ్య విభాగపు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్ప యాదవ్, డిప్యూటీ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్ నాగ శేషారావు,జనసేనఅధ్యక్షులు సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# '100 రోజుల జలధార'తో భూగర్భ జలాల పెంపు



నంద్యాల, మహి న్యూస్, ఏప్రిల్ 15:- రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన '100 రోజుల జలధార' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసి, జిల్లాలో భూగర్భ జలాల మట్టాన్ని 3 నుండి 6 మీటర్ల వరకు పెంచాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో '100 రోజుల జలధార' కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జల వనరుల శాఖ ఎస్ఈ శివశంకర్ రెడ్డి, భూగర్భ జల అధికారి రఘురాం, డ్వామా పీడీ సూర్యనారాయణ, జలదార కార్యక్రమ ప్రత్యేక అధికారి లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ, '100 రోజుల జలధార' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసి భూగర్భ జల మట్టాన్ని పెంచేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాగుల పునరుద్ధరణ, క్యాస్కేడ్ వ్యవస్థల బలోపేతం, స్ట్రీమ్ కనెక్టివిటీ, భాగస్వామ్య భూగర్భ జలాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**తేమగా లేని పొడి వాతావరణం..**

**నీటి కొరత సవాళ్లు**

నంద్యాల జిల్లాలో తేమగా లేని పొడి వాతావరణ పరిస్థితులు ఉండటంతో, భూగర్భ జలాలు ప్రధానంగా వర్షాధారంగా ఉంటున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. సాగు కోసం అధికంగా భూగర్భ జలాలపై ఆధారపడటం వల్ల అనేక మండలాల్లో నీటి మట్టాలు తగ్గిపోవడంతో పాటు కాలానుగుణంగా నీటి కొరత తీవ్రంగా మారుతోందన్నారు.

**పెన్నా - కృష్ణా బేసిన్ల ప్రాధాన్యం**

జిల్లాలో 70 శాతం విస్తీర్ణం పెన్నా బేసిన్ పరిధిలో ఉండగా, మిగిలిన 30 శాతం కృష్ణా బేసిన్‌లో ఉందన్నారు. కుందేరు, గుండ్లకమ్మ వంటి ఉపబేసిన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని, మొత్తం 46 మైక్రో బేసిన్ల ఆధారంగా సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

**ట్యాంక్ క్యాస్కేడ్ వ్యవస్థల బలోపేతం**

జిల్లాలో 330 చెరువుల్లో 27 క్యాస్కేడ్ వ్యవస్థలు ఉండి, అవి 86 చెరువులను అనుసంధానిస్తున్నాయని తెలిపారు. క్యాస్కేడ్ కనెక్టివిటీ, స్ట్రీమ్ కనెక్టివిటీ మెరుగుపరచడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

**389 పనులతో యాక్షన్ ప్లాన్ సిద్ధం**

జిల్లాలో నీటి నిర్వహణకు సంబంధించి 389 పనులను గుర్తించి, ఫీడర్ ఛానళ్ల శుభ్రపరచడం, డీ-సిల్టింగ్, చెరువుల పునరుద్ధరణ వంటి చర్యలపై ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 407 పనుల డేటా సేకరణ జరగగా, 155 పనులను ధృవీకరించి, మిగిలినవి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

**క్షేత్రస్థాయిలో సమస్యలు - వెంటనే పరిష్కారం అవసరం**

కాలువలు గడ్డి, పిచ్చి మొక్కలతో నిండిపోవడం వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోందని, వీటి తొలగింపుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ పథకం కింద జంగిల్ క్లీనింగ్ పనులను చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

**భూగర్భ జలాల సంక్షోభ మండలాలపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో 11 మండలాల్లో భూగర్భ జలాల సమస్య తీవ్రంగా ఉందని పేర్కొంటూ, పాణ్యం, డోన్, బేతంచెర్ల, బనగానపల్లి, సంజామల, కొలిమిగుండ్ల వంటి ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. రిడ్జ్ టు వ్యాలీ కాన్సెప్ట్ ద్వారా నీటి నిల్వను పెంచాలని తెలిపారు.

**ఫార్మ్ పాండ్స్, చెక్ డ్యామ్ ల వినియోగం**

ఇప్పటివరకు 22,221 ఫార్మ్ పాండ్స్, చెక్ డ్యామ్ ల ద్వారా నీటిని నిల్వ చేసినప్పటికీ, ఇంకా నిల్వ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. చెరువుల మొత్తం నిల్వ సామర్థ్యం 5.5 టీఎంసీగా ఉన్నప్పటికీ, దీన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు.

**టెక్నాలజీ వినియోగం - పారదర్శకతకు ప్రాధాన్యం**

పనుల పురోగతిని యాప్ ద్వారా నమోదు చేయడంలో ఉన్న సాంకేతిక సమస్యలను త్వరగా పరిష్కరించాలని, జియో ట్యాగింగ్, రియల్ టైమ్ డేటా అప్డేట్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. అధికారులు కేవలం రికార్డులకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలనలు చేయాలని సూచించారు.

**నీటి భద్రతే ప్రధాన లక్ష్యం**

జిల్లాలో నీటి వనరుల సమగ్ర వినియోగం, భూగర్భ జలాల రీచార్జ్, వాగుల పునరుద్ధరణ ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ జి. రాజకుమారి స్పష్టం చేశారు.

RNI : APTEL/25/A0108
మహి న్యూస్
www.mahinewsindia.com
epaper: https://epaper.mahinewsindia.com
తెలుగు దినపత్రిక



# నష్టపోయిన గొర్రెల రైతును ప్రభుత్వం ఆదుకోవాలి



గాలివీడు:ఏప్రిల్15(మహి న్యూస్ ): విషతుల్యమైన మేపు తిని గొర్రెలు మృతి చెందిన ఘటనలో నష్టపోయిన రైతును ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం సంఘటన చోటుచేసుకున్న నూలువీడు గ్రామం ఆవులరెడ్డి గారి పల్లెలో నివసిస్తున్న పాడి రైతు ఆదినారాయణను ఆయన పరామర్శించారు.ఈ సందర్భంగా బాధిత రైతుకు ధైర్యం చెప్పిన రంగారెడ్డి, గొర్రెల మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదినారాయణ 150 గొర్రెలను పెంచుకుంటూ వాటి ద్వారానే జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. భార్య, ఇద్దరు కుమార్తెలను పోషించుకుంటున్న ఈ కుటుంబానికి జరిగిన సంఘటన ఆర్థికంగా కుంగదీసిందన్నారు.సోమవారం జరిగిన ఈ దుర్ఘటనలో అకస్మాత్తుగా 70 గొర్రెలు మృతి చెందడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఘటనపై రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, వికలాంగుడు అయిన ఆదినారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.బాధిత రైతుకు తగిన నష్టపరిహారం అందజేసి, కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# రెండో విడత అక్రిడిటేషన్ల జారీకి ఆమోదం

## డిఎంఎసి చైర్మన్, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



వైయస్సార్ కడప,మహి న్యూస్ ఏప్రిల్ 15: జిల్లాలోని అర్హులైన 189 మంది జర్నలిస్టులకు రెండవ విడతలో అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ ఆమోదం తెలిపిందనీ డిఎంఎసి చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్ నందు జిల్లా కలెక్టర్ డీఎంఎస్సీ చైర్మన్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా మీడియా అక్రిడిటేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... అర్హులైన జర్నలిస్టులందరికీ నిబంధనల ప్రకారం అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరిగిందన్నారు.మొదటి విడతలో 538 మంజూరు కాగా రెండో విడతలో 189 మందికి కమిటీ ఆమోదం తెలిపిందనన్నారు.ఇంకా అర్హత ఉన్న పాత్రికేయులు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న వారికి మరియు వివిధ కారణాలతో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి తదుపరి సమావేశం లో అక్రిడిటేషన్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశం లో ఇంచార్జ్ డీఆర్వో వెంకటపతి, డిఎంఎసి కన్వీనర్ నెంబర్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారిని పద్మజ,డివిజనల్ పీఆర్వో సునీల్ సాగర్, ఆర్టీసీ ఆర్ఎం గోపాల్ రెడ్డి , అసిస్టెంట్ లేబర్ కమిషనర్, రైల్వే పీఆర్వో జనార్ధన్,బ్యూరో చీఫ్ విశాలాంధ్ర పి.రామసుబ్బా రెడ్డి, స్టాఫ్ రిపోర్టర్ ప్రజాశక్తి నూర్ బాషా,స్టాఫ్ రిపోర్టర్ ఈ టివి జి.మురళి మోహన్ గౌడ్, స్టాఫ్ రిపోర్టర్ హెచ్ యంటివి వి.యం.చంద్ర మోహన్ రాజు,రిపోర్టర్ ఆంధ్రప్రభ ఐ.సి.సుబ్బారెడ్డి,ఎడిటర్ రాయలసీమ సమయం ఏ.సందీప్ కుమార్ రెడ్డి,ఎడిటర్ కొత్త తరంగం కె.రమేష్,స్టాఫ్ రిపోర్టర్ మహా న్యూస్ యు శ్రీకాంత్, కరస్పాండెంట్ ప్రసార భారతి బి.శ్రీనాథ్ రెడ్డి, ఫోటోగ్రాఫర్ ఆంధ్ర జ్యోతి టి.రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



# ఎగువగొట్టివీడు వద్ద బైక్ ప్రమాదం:ఇద్దరికి గాయాలు



గాలివీడు:ఏప్రిల్ 15(మహి న్యూస్ ): మండలంలోని ఎగువగొట్టివీడు వద్ద బుధవారం ద్విచక్ర వాహనం ప్రమాదానికి గురైంది. స్థానికుల కథనం మేరకు తూముకుంట గ్రామానికి చెందిన అమర్నాథ రెడ్డి,వరప్రసాద్ రెడ్డిలు బైక్‌పై ప్రయాణిస్తుండగా, గొట్టివీడు వద్దకు రాగానే వేగంగా వచ్చిన ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు ప్రక్కనే ఉన్న కాలువ గోతిలో పడిపోయింది.ఈ ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న అంబులెన్స్ సిబ్బంది గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాదంలో ఇద్దరికీ గాయాలు అవ్వగా ఒకరి పరిస్థితి విషమంగా వుంది. వారి ఆరోగ్య పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.

# జర్నలిస్టు హెల్త్ స్కీమ్ పొడిగింపు

## జీవో ఎం.ఎస్ నెం. 43 విడుదల

## కేఎస్. విశ్వనాథన్ సంచాలకులు, సమాచార పౌరసంబంధాల శాఖ

వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్ 2026--27 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ జీవో యం.యస్ నెం: 43 ను జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. కావున రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్లు అమలులో ఉన్న వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం ప్రీమియం క్రింద రూ. 1250/- www.cfms.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఈ క్రింద తెలిపిన పద్దుకు చెల్లించి లబ్ధి పొందవలసినదిగా సంచాలకులు తెలిపారు. Head of Account: 8342-00-120-01-03-001-001, DDO Code: 2703 0802 003 ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు తమ కుటుంబ సభ్యుల ఆధార్ కార్డులు, ఫోటోలు, జెపిజి ఫార్మాట్ లో సంబంధిత జిరాక్స్ కాపీలను, విజయవాడ పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ లోని రెండవ ఫ్లోర్ లో ఉన్న సమాచార పౌర సంబంధాల శాఖ, సంచాలకుల కార్యాలయంలోనూ, జిల్లా స్థాయి జర్నలిస్టులు అయితే సంబంధిత జిల్లా కేంద్రాల్లోని సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో అందజేయాల్సిందిగా సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ తెలిపారు. వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం ప్రీమియం రూ.2,500 కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ.1,250, ప్రభుత్వం తన వాటా రూ.1,250 చెల్లిస్తుందన్నారు. జర్నలిస్టు, భార్య/భర్త, పిల్లలు, జర్నలిస్టుపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఈ స్కీమ్ వర్తిస్తుందన్నారు.

# జలధార కార్యక్రమాన్ని అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించాలి..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి





కడప, మహి న్యూస్ ఏప్రిల్ 15 : నీటి భద్రతా కార్యక్రమంలో రైతులు, సాగునీటి సంఘాల భాగస్వాములతో జలాధార కార్యక్రమాలను మరింత ప్రాధాన్యతతో పటిష్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి ఎంపిడివోలను ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలు నుండి జిల్లా కలెక్టర్ డా. శ్రీదర్ చెరుకూరి.. 'జలధార.. నీటి భద్రత-సాగు నీటి సంఘాల బాధ్యత' అమలు ప్రణాళిక, అమలుపై.. జేసీ డా. నిధి మీనా, డిఎఫ్ఓ వినీత్ కుమార్ లతో కలిసి సంబంధిత అన్ని మండలాల ఎంపిడివోలు, ఏపీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో భూగర్భ జలాలు మట్టాన్ని పెంపొందించడం, నీటి వనరులు సంరక్షణ, సాగునీటి వ్యవస్థ బలోపేతం లక్ష్యంగా క్షేత్రస్థాయిలో అవసరాలను గుర్తించాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులను గుర్తించడం నీటి భద్రత, సాగునీటి పొదుపు, కొత్త ఆయకట్టు మదుపు, వాగులు, చెరువుల అనుసంధానం, సూక్ష్మ సేద్యం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం.. తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు సాగునీటి కాలువలు, చెరువులు గట్లను బలోపేతం చేయడం, కాలువల పూడికతీత, లాక్స్ మరమ్మతులు వంటి పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో చెక్ డ్యాములు, రోడ్డు పక్కన ఉన్న కాల్వల డైవర్షన్ వంటి పనులు పనులు చేసి ఉంటే గుర్తించి.. క్లియర్ చేసేందుకు ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పనులను ప్రతిపాదించాలన్నారు. గ్రామ పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలు, కాల్వలలో పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగింపు, చెరువులు, కాలువల అనుసంధానం, భూగర్భ జలాల సంరక్షణ కోసం సూక్ష్మ నీటి సాగును ప్రోత్సహించడం స్లూయిజ్ కాల్వల రిపేరీపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కాన్సెట్ ట్యాంక్ లు, తాత్కాలికంగా మళ్లింపు చేసిన కాలువలను గుర్తించి రిస్టార్ చేయాలన్నారు. ఈ పనుల్లో ప్రజలు ముఖంగా మహిళా రైతులు, డ్వాక్రా మహిళలు భాగస్వామ్యంతో పనులను వేగవంతంగా, నాణ్యతగా చేపట్టాలన్నారు. జలవనరులు శాఖ, అటవీ శాఖ, పంచాయతీ రాజ్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు, డ్వామా తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. సాగునీటి సంఘాలను పటిష్టం చేసే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. భూగర్భ జలాలను పెంపొందించే దిశగా ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పి సీఈవో రామచంద్రారెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ అబ్దుస్, డ్వామా పీడి అదిశేషారెడ్డి, స్టెప్ సీఈవో జోయల్ విజయ్ కుమార్, గ్రౌండ్ వాటర్.డిడి మురళీధర్, డిఆర్డీఏ, మెప్మా పీడీలు రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 17,18,19 తేదీలలో నంద్యాలలో జరిగే సిఐటియు రాష్ట్ర మహాసభలును జయప్రదం చేయండి!!

## సిఐటియు రాష్ట్ర కౌన్సిల్, సభ్యులు, సిహెచ్ చంద్రశేఖర్

రైల్వే. కోదూరు. మహిన్యూస్:ఏప్రిల్:15: సిఐటియు రాష్ట్ర 17వ మహాసభలను, నంద్యాలలో ఈనెల ఏప్రిల్ 17 నుండి 19 వరకు, మూడు రోజులు జరుగుతాయని, వాటిని జయప్రదం చేయాలని, సిఐటియు రాష్ట్ర కౌన్సిల్,సభ్యులు, సిహెచ్ చంద్రశేఖర్, ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఐటియు రాష్ట్ర మహాసభలలో, గత కార్యక్రమాల సమీక్షించి, భవిష్యత్తు కర్తవ్యల రూపొందించడం జరుగుతుందని, అదేవిధంగా కార్మికవర్గం ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామని, రాబోయే కాలంలో కార్మికవర్గ పోరాటలకు దశ, దిశా నిర్దేశం చేయడానికి దోహదపడుతాయని అన్నారు. 1970లో ఐఖ్యతా, పోరాటం నినాదంతో స్థాపించన సిఐటియు నేడు భారతదేశంలోని ప్రధాన కేంద్ర కార్మిక సంఘంగా ఉందని అన్నారు. కార్మికుల హక్కులు, వేతనాలు, పని పరిస్థితుల మెరుగుదల, సామాజిక న్యాయం పెట్టుబడిదారీ దోపిడీకీ వ్యతిరేకంగా పోరాడుతుందని అన్నారు. కార్మిక హక్కుల పరిరక్షణ, కనీస వేతనం, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా




పథకాల కోసం మరియు ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త ఆందోళనలు, సమ్మెలు నిర్వహిస్తుందని అన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వం కార్మికవర్గం అశేష త్యాగాలతో పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులు కాలరాస్తూ 29 కార్మిక చట్టాలు రద్దు చేసి వాటిస్థానంలో 4 లేబర్ కోడ్లుగా మార్చి వేసిందని అన్నారు. కార్మికవర్గాన్ని యజమానులకు బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మిక హక్కులు యాజమాన్యాలు దయాదక్షణాలపై ఆధారపడాల్సిందన్నారు. ప్రజలు అనుభవిస్తున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, చట్టాలు పోరాడి సాధించుకున్నవే తప్ప ఏ పెట్టుబడుదారులు గాని,పాలకులు ఇష్టంతో ప్రసాదించినవి కాదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత 15 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరించలేదని అన్నారు. కనీస వేతనం 26 వేలు రూపాయలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే శ్రామిక ఉత్సవాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రజాశక్తి బుక్ హౌస్, నిర్వహిస్తు న్నారన్నారు. 17వ తేదీ ఉదయం ర్యాలీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలకు, జాతీయ రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. ఉద్యోగులు కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఆర్. వెంకటేష్ పాల్గొన్నారు.

# జనగణన-2027 ను వై ఎస్ ఆర్ కడప జిల్లా లో విజయవంతం చేద్దాం

## భారత దేశ అభివృద్ధి కి మీ వంతు సహకారం అందించండి..
## ఖచ్చితమైన సమాచారం ఇవ్వాలి....
## వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచబడతాయి
## టోల్ ఫ్రీ నెంబరు 1855
## జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి




వైయస్సార్ కడప, మహి న్యూస్ ఏప్రిల్ 15: జనగణన-2027 ను వై ఎస్ ఆర్ కడప జిల్లాలో విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. బుధవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు జనగణన 2027 పై జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ విలేకరుల సమావేశంలో భాగంగా ఏప్రిల్ 16 నుండి జిల్లా లో ప్రారంభమయ్యే జన గణన 2027 కుసంబంధించిన గోడపత్రికలను జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్ డా.నిధి మీనా,ఇన్చార్జి డిఆర్ఓ వెంకటపతి జన గణ మన జిల్లా నోడల్ అధికారి కిరణ్ కుమార్ లతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ..... భారతదేశం లో నిర్వహించ నున్న 2027 జనాభా గణన (సెన్సస్)కు సంబంధించి వై ఎస్ ఆర్ కడప జిల్లాలో గత మూడు నెలల నుండి కొనసాగుతున్న ముందస్తు ఏర్పాట్లు మరియుఅధికారుల శిక్షణా కార్యక్రమాలు విజయ వంతం గా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఈ గణన కార్యక్రమం రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో గృహాల గుర్తింపు మరియు ఆ ఇంటిలోని సౌకర్యాల (టీవీ, ఇంటర్నెట్,ఫోన్ వంటివి) వివరాల సేకరణ ఉంటుందని, రెండో దశలో ఫిబ్రవరి 9 నుండి 28 వరకు వ్యక్తిగత వివరాలను సేకరిస్తామని తెలిపారు.ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' సౌకర్యాన్ని ఏప్రిల్ 16 నుండి ఏప్రిల్ 30వ తేదీ వరకు మొబైల్ యాప్ లేదాట్రీజూః//ఎవ. ఒవఅంబం. ప్రశీజ.అఅ పోర్టల్ ద్వారా వినియోగించుకోవచ్చని, దీనివల్ల సమయం ఆదా అవుతుందని పేర్కొన్నారు. అనంతరం మే 1వ తేదీ నుండి 30వ తేదీ వరకు గణన అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఇళ్ల నంబర్లు, భవన నిర్మాణ సమాచారం వంటివి సేకరిస్తారని, ఆన్‌లైన్ లో ముందుగా నమోదు చేసుకున్న వారికి వెరిఫికేషన్ ప్రక్రియ కేవలం 5 నుండి 10 నిమిషాల్లోనే పూర్తవుతుందని వివరించారు.సేకరించిన సమాచారం అత్యంత గోప్యంగా కేవలం భారత ప్రభుత్వ సర్వర్ లోనే భద్రపరచబడుతుందని,ఏ ఇతర వ్యక్తిగత పథకాలకు దీనిని వాడబోరని స్పష్టం చేస్తూ,సందేహాల నివృత్తికి టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించ వచ్చని తెలిపారు. దేశాభివృద్ధి కి మరియు భవిష్యత్ ప్రణాళికల రూపకల్పనకు అత్యంత కీలకమైన ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజలందరూ భాగస్వాములై కచ్చితమైన వివరాలను అందించి సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచి, ప్రతి ఒక్కరూ తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలాప్రోత్సహిస్తున్నామని తెలిపారు.జనగణన విజయవంతం కావాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం,అందువల్ల జిల్లాలోని ప్రజలందరూ స్వీయగణన సదుపాయాన్ని వినియోగించుకుని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నాం.

జిల్లా లో భౌగోళిక యూనిట్లు ఒ సిబ్బంది వివరాలు
జిల్లాల సంఖ్య: 1
గ్రామాలు: 793
పట్టణాలు: 8
మున్సిపల్ కార్పొరేషన్: 1
పీసీఓలు (పీసీఓఎస్): 2
చార్జీలు: 48
కార్పొరేషన్: 1
మండలాలు: 39
మున్సిపాలిటీలు: 8
అంచనా ఎన్యూమరేటర్లు: 4091
అంచనా సూపర్వైజర్లు: 710

### గ్రామాలు,బ్లాకుల వారీగా ఫంక్షనరీల వివరాలు..

వై.యస్.ఆర్. కడప జిల్లా లో మొత్తం 39 మండలాల పరిధిలో 793 రెవెన్యూ గ్రామాలను 2728 బ్లాకులుగా విభజించారు. కడప నగర పట్టణంలోని 50 వార్డులను 822 బ్లాకులుగా విభజించారు. జిల్లాలోని 8 నగర పంచాయతీలలో 224 వార్డులను 982 బ్లాకులుగా విభజించారు. ఈ మొత్తం ప్రక్రియలో భాగంగా మొత్తం 4801 మంది క్షేత్ర స్థాయి సిబ్బందిని నియమించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఏప్రిల్ 16న ప్రజా ప్రతినిధులతో ప్రారంభించి.. ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారాన్ని నిర్వహించేందుకు వివిధ వర్గాలను భాగస్వామ్యం చేస్తూ ప్రత్యేక రోజులు కేటాయించాం.

### 15 రోజుల ప్రత్యేక ప్రచార ప్రణాళిక:

ఏప్రిల్ 16:మంత్రులు, ఎమ్మెల్యేలు మరియు పంచాయతీ ప్రతినిధుల స్వీయగణన
ఏప్రిల్ 17: సచివాలయ సిబ్బంది,జిల్లా కలెక్టర్లు మరియు ప్రభుత్వ శాఖాధిపతుల గణన.
ఏప్రిల్ 18: పద్మ అవార్డు గ్రహీతలు, క్రీడాకారులు మరియు సినీ ప్రముఖుల గణన.
ఏప్రిల్ 19 ఒ 28: డ్వాక్రా (ఎస్జీ) మహిళా సంఘాల సభ్యుల కోసం ప్రత్యేక డ్రైవ్.
ఏప్రిల్ 20: ఉపాధి హామీ (నైగ్స్ ) కూలీల కోసం పని ప్రదేశాల్లో మొదటి విడత గణన.
ఏప్రిల్ 21: జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగుల స్వీయగణన
ఏప్రిల్ 22: కళాశాల మరియు విశ్వవిద్యాలయ విద్యార్థుల భాగస్వామ్యం.
ఏప్రిల్ 23: అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణీలు, ఆశా కార్యకర్తల కోసం ప్రత్యేక కార్యక్రమం.
ఏప్రిల్ 24: గిరిజన ప్రాంతాలు మరియు వారపు సంతల్లో ప్రత్యేక అవగాహన.
ఏప్రిల్ 25: పట్టణ ప్రాంతాల్లోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ () సమావేశాలు మరియు వృద్ధాశ్రమాలలో ప్రత్యేక గణన డ్రైవ్.
ఏప్రిల్ 26: జిల్లా కేంద్రాల్లో 'జనాభా గణన 5ఖ రన్' నిర్వహణ.
ఏప్రిల్ 27: ఫ్యాక్టరీలు, పరిశ్రమలు మరియు బ్యాంకింగ్ రంగ కార్మికుల గణన.
ఏప్రిల్ 28:డ్వాక్రా (ఎస్ చ్ జి ) మహిళా సంఘాల సభ్యుల కోసం రెండవ విడత డ్రైవ్.
ఏప్రిల్ 29: పోలీస్ సిబ్బంది కోసం ప్రత్యేక స్వీయ గణన డ్రైవ్.
ఏప్రిల్ 30: ఉపాధి హామీ (నైగ్స్ ) కూలీల కోసం పని ప్రదేశాల్లో రెండో విడత గణన.

స్వీయ గణన పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ, ప్రతి పౌరుడు స్వయంగా పోర్టల్ ద్వారా తన వివరాలు నమోదు చేసుకోవచ్చు.
ఎవరూ స్వీయగణన చేయని పక్షంలో, మే 1 నుండి ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు.
సేకరించే సమాచారం (హౌసేహోల్డ్ డేటా)..

### ఇళ్ల వివరాలు :

బిల్డింగ్ నంబర్, హౌస్ నంబర్
ఫ్లోర్, వాల్, రూఫ్ నిర్మాణ పదార్థం
ఇల్లు వినియోగం, స్థితి

### కుటుంబ సమాచారం :

కుటుంబ సభ్యుల సంఖ్య
కుటుంబ ప్రధానుడి పేరు, లింగం, సామాజిక వర్గం (ఎస్సీ /ఎస్టీ /అదర్ )
ఇల్లు యాజమాన్యం, గదుల సంఖ్యవివాహితుల సంఖ్య
సౌకర్యాలు :
తాగునీటి వనరు, అందుబాటు,విద్యుత్, మరుగుదొడ్డి, స్నాన సౌకర్యం
వంట ఇంధనం (ఎల్పీజీ /పీఎంజీ)
ఆస్తులు:
టీవీ, రేడియో ఇంటర్నెట్, కంప్యూటర్ మొబైల్ ఫోన్ బైక్, కారు మొదలైన వాహనాలు

### ముఖ్య సూచనలు

ఒక కుటుంబానికి ఒక మొబైల్ నంబర్ మాత్రమే ఉపయోగించాలి
స్వీయగణన తర్వాత 11 అంకెల ఐడి (సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఐడి ) వస్తుంది
ఆ ఐడిని భద్రంగా ఉంచుకోవాలి
తర్వాత ఎన్యూమరేటర్ వచ్చినప్పుడు ఆ ఐడిని చూపాలి

### ఐడి మ్యాచింగ్ విధానం:

పౌరులు నమోదు చేసిన సెల్ఫ్ ఎన్యూమరేషన్ ఐడి , ఎన్యూమరేటర్ మొబైల్‌లో ఉన్న ఐడి తో సరిపోతే, ఆ వివరాలు ధృవీకరించబడి అంగీకరించబడతాయి. ఐడి సరిపోకపోతే, ఎన్యూమరేటర్ తిరిగి గృహ వివరాలను సేకరిస్తారు.

### ప్రధాన ప్రయోజనాలు:

ఖచ్చితత్వం – గోప్యత : ప్రజలు తమ వివరాలను స్వయంగా నమోదు చేయడం వల్ల పొరపాట్లు తగ్గి, గోప్యత పెరుగుతుంది.
సౌలభ్యం : కుటుంబ సభ్యులు ఇంటి వద్దే తమ సమయానికి అనుగుణంగా వివరాలను నమోదు చేసుకోవచ్చు.
సమర్థత : ఫీల్డ్‌లో ఎన్యూమరేటర్ పనిభారం తగ్గి, జనగణన ప్రక్రియ వేగవంతమవుతుంది.

### ముఖ్య సూచనలు:

ఖచ్చితమైన సమాచారం ఇవ్వడం తప్పనిసరి : స్వీయ గణన ఐచ్ఛికమైనదైనా, సరైన సమాచారం ఇవ్వడం చట్టపరమైన బాధ్యత.
వలసదారులు – కిరాయిదారులు : మీరు ప్రస్తుతం నివసిస్తున్న ప్రదేశంలోనే నమోదు చేసుకోవాలి. స్వస్థలం లేదా పౌరసత్వం ఆధారంగా కాదు.
తప్పుల సవరణ : పోర్టల్‌లో చేసిన పొరపాట్లు ఎన్యూమరేటర్ ఫీల్డ్ విజిట్ సమయంలో మాత్రమే సరిచేయవచ్చు.
ఈ విధంగా స్వీయ గణన విధానం ద్వారా ప్రజలు సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

### ఇతర ముఖ్య విషయాలు

పూర్తి వివరాలు నమోదు చేయకపోతే గణన పూర్తి కాదని పరిగణించడం జరుగుతుంది.
ఫైనల్ సబ్మిట్ చేసిన తర్వాత మార్పులు చేయడానికి అవకాశం ఉండదు. కానీ ఎన్యూమరేటర్ మాత్రమే సరిదిద్దగలరు.

### జిల్లా ప్రజలకు విజ్ఞప్తి..:

జనగణన విజయవంతం కావడానికి ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకం
ప్రతి కుటుంబం స్వీయగణన సదుపాయాన్ని వినియోగించుకోవాలి
ఖచ్చితమైన సమాచారం అందించి ప్రభుత్వానికి సహకరించాలి
జనగణన ద్వారా సేకరించే సమాచారం భవిష్యత్ ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలుకు ఎంతో కీలకం
దశల వారీగా స్వీయగణన విధానం (స్టెప్ -బై -స్టెప్ )..
స్టెప్ 1: పోర్టల్‌లో లాగిన్ అవ్వాలి
స్టెప్ 2: కుటుంబ నమోదు (హెడ్ ఆఫ్ హౌసేహోల్డ్ వివరాలు నమోదు)
స్టెప్ 3: భాష ఎంపిక ఒ ఓటీపీ ధృవీకరణ
స్టెప్ 4: చిరునామా వివరాలు నమోదు
స్టెప్ 5: మ్యాప్‌లో ఇల్లు గుర్తించడం
స్టెప్ 6: ప్రశ్నావళి పూర్తి చేయడం
స్టెప్ 7: వివరాల సమీక్ష (ప్రివ్యూ)
స్టెప్ 8: ఫైనల్ సబ్మిట్
స్టెప్ 9: ఫీల్డ్ వెరిఫికేషన్

# రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు

## దివ్యాంగ శక్తి బస్సు పాసుల పంపిణీ కార్యక్రమంలో

వీరబల్లి/రాజంపేట:మహిన్యూస్. ఏప్రిల్:15 : కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయుడు గారు చేపట్టిన దివ్యాంగ శక్తి పథకం దివ్యాంగుల పాలిట వరంగా మారింది. రాజంపేట తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ శ్రీ చమర్తి జగన్మోహన్ రాజు గారు ప్రత్యేక చొరవ చూపి నియోజకవర్గ వ్యాప్తంగా దివ్యాంగులకు తన సొంత నిధులతో ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకొని దివ్యాంగులకు బస్సు పాసుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఒక్కో బస్సు పాస్ కు ?100 చొప్పున 2000 మందికి పైగా లబ్ధిదారులకి సొంత నిధులతో ఆర్టీసీ అధికారులు చెల్లింపు చేశారు.నేడు వీరబల్లి మండలంలో పర్యటిస్తూ బస్సు పాసుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన



మాట్లాడుతూ నిస్వార్థ సేవ చేస్తున్న చంద్రబాబు గారు దారి చూపిస్తే దారిలోని చిన్నచిన్న గులకరాళ్ళను తొలగించి సహాయాన్ని సంపూర్ణం చేశాం అన్నారు. నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు దివ్యాంగుల



ఇంటి దగ్గరికి వెళ్లి పాసులకు కావాల్సిన పేపర్లను స్వయంగా సేకరించారన్నారు. నియోజకవర్గ పార్టీ కార్యాలయం ఆర్టీసీ అధికారులతో సమన్వయం చేసుకుని దివ్యాంగులకు పాసులు సకాలంలో అందేలా పనిచేయడం జరిగింది అన్నారు. దివ్యాంగులకు సమయముతో పాటు వ్యయ ప్రయాసలు తగ్గించామన్నారు. దివ్యాంగులతో పాటు ప్రయాణం చేసే సహాయకుడికి టికెట్ లో 50% రాయితీ ఇవ్వడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో దివ్యాంగులు, కూటమి నాయకులు, కార్యకర్తలు,అధికారులు ప్రజలు పాల్గొన్నారు.

EDITOR and PUBLISHER and OWNED BY NEELI RAMASUBBAIAH, PUBLISHED AT #1/704, PARK STREET, NEAR OLD BUSTAND, JAMMALAMADUGU-516434,YSR KADAPADIST, A.PPRINTED AT VSAR PRINTERS, YSR KADAPA DIST, 516004. RNI NO : APTEL/25/A0108. Cell 90 59 58 58 98. Email : mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com